

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | మంగళవారం 30-06-2026 | సంపుటి - 29 | సంచిక -38 | రూ : 4 | పేజీలు: 8


# మరో రూ.2 వేల కోట్లు



- ఉద్యోగుల బకాయిల కోసం విడుదల
- నెల రోజుల వ్యవధిలోనే రూ.4 వేల కోట్లు
- పింఛన్‌దారుల జీపీఎఫ్ బకాయిలు వందశాతం చెల్లింపు
- మా చిత్తశుద్ధి మరోసారి నిరూపితమైంది: ఉపముఖ్యమంత్రి భట్టి

హైదరాబాద్: ఉద్యోగులు, పింఛన్‌దారుల బకాయిల చెల్లింపుల కోసం మరో రూ.2 వేల కోట్లను విడుదల చేస్తూ ఆర్థికశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గత నెల(మే) 29న మొదటి విడతగా రూ.2 వేల కోట్లు విడుదల చేయగా సరిగ్గా అదే తేదీన ఈ నెల కూడా ఇచ్చింది. మొత్తం రూ.4 వేల కోట్ల చెల్లింపు పూర్తయింది. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపు కోసం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

*** పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు..**

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఆర్థికశాఖ తెలిపింది.

**తరువాయి 2లో**




# 'రైతు భరోసా' విడుదల నేడే

- తొలివిడతలో 41.37 లక్షల మందికి లబ్ధి
- వారి ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ
- సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ కార్యక్రమం
- ఖమ్మం రైతు ఆశీర్వాద సభ హైదరాబాద్‌కు మార్పు

హైదరాబాద్: రాష్ట్ర రైతులకు పంట పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా వానాకాలం సీజన్ నిధులు మంగళవారం విడుదల కానున్నాయి. మొదటి విడత కింద రెండు ఎకరాల వరకు భూమి ఉన్న 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ కానున్నాయి. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి ల్యాప్‌ట్యాప్‌లో మీట నొక్కి నిధులను విడుదల చేస్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర శాసనసభ నియోజకవర్గ పరిధిలోని చింతకానిలో నిర్వహించ తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను భారీ వర్షాల కారణంగా రద్దు చేసి.. సీఎం సూచనల మేరకు హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేశారు.

*** మొత్తం 73.32 లక్షల మందికి సాయం**

ఎకరానికి రూ.ఆరు వేల చొప్పున.. 73.32 లక్షల మంది రైతులకు చెందిన మొత్తం కోటిన్నర ఎకరాలకు రూ.9 వేల కోట్లు దశలవారీగా విడుదల చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. తొలి విడతలో రెండు ఎకరాల వరకు భూమి ఉన్న 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ చేస్తాం అన్నారు. ఈ నిధుల విడుదలపై ప్రభుత్వం ముంబయిలోని రిజర్వ్ బ్యాంకు కార్యాలయానికి, హైదరాబాద్‌లోని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ)కి, అన్ని బ్యాంకులకు ఈ నెల 27నే సమాచారం అందజేసింది. రుణ బకాయిల కింద మినహాయించుకోకుండా రైతుల ఖాతాల్లో ఈ భరోసా నిధులు పూర్తిగా జమ చేయాలని బ్యాంకులకు స్పష్టంగా **తరువాయి 2లో**

# బంగాళాఖాతంలో పాక్ సబ్ మెరైన్ల కలకలం భారత్‌కు కొత్త ముప్పు!



- బంగాళాఖాతంలో పాకిస్థాన్ అత్యాధునిక జలాంతర్గామీ పీఎన్ఎస్ హ్యాంగోర్ సంచారం
- చైనా నిర్మించిన ఈ సబ్‌మెరైన్ వారాలపాటు నీటి అడుగున ఉండగలదు
- బంగ్లాదేశ్‌లోనూ చైనా నిర్మించిన బీఎన్ఎస్ పెకువా నేవల్ బేస్
- ఈ బేస్ పాక్, చైనా సబ్‌మెరైన్‌లకు లాజిస్టిక్స్ హబ్‌గా మారే ప్రమాదం
- భారత తూర్పు తీరానికి సమీపంలో పెరిగిన భద్రతాపరమైన సవాళ్లు

ఢిల్లీ : బంగాళాఖాతంలో భారత నౌకాదళానికి కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయి. పాకిస్థాన్ నౌకాదళంలోకి కొత్తగా చేరిన అత్యాధునిక సబ్‌మెరైన్ 'పీఎన్ఎస్ హ్యాంగోర్' ఈ ప్రాంతంలో సంచరించడం, అదే సమయంలో బంగ్లాదేశ్‌లో చైనా నిర్మించిన 'బీఎన్ఎస్ పెకువా' నౌకా స్థావరం సిద్ధమవడం భారత్‌కు భద్రతాపరంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ రెండు పరిణామాలు కలిసి భారత తూర్పు తీరంలో వ్యూహాత్మక ఒత్తిడిని పెంచుతున్నాయి. చైనా సహకారంతో నిర్మించిన పీఎన్ఎస్ హ్యాంగోర్, పాకిస్థాన్‌కు అప్పగించిన 8 జలాంతర్గాములలో మొదటిది. ఇందులో ఉన్న ఎయిర్‌ఇండిపెండెంట్ **తరువాయి 2లో**

# ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం

- జులై 4న ఖమేనీ అంతక్రియలు ప్రారంభం
- ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటనకు మోదీ
- ముందే ఖరారైన షెడ్యూల్ కారణంగా అంత్యక్రియలకు ప్రధాని దూరం
- భారత్ తరపున బిహార్ గవర్నర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి
- జులై 9న ఖమేనీ ఖననం

**2లో**





## రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపిన సీఎం

- స్తం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు జమ చేసి అండగా నిలిచామని వెల్లడి
- ప్రకృతి వ్యవసాయంతో భూమిని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపు
- ప్రభుత్వ సలహాలు పాటిస్తూ రైతులు సిరులు పండించాలని ఆకాంక్ష

**2లో**

## మూసీ పరిహారం.. పునరావాసంలో రాజీపడం



- మానవీయ కోణంలో భూసేకరణ నిర్ణయాలు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**2లో**

# ఢిల్లీలో పెట్రోల్ బైక్స్‌కు చెక్.. 2028 నుంచి రిజిస్ట్రేషన్ బంద్!



- 'ఢిల్లీ ఈవీ పాలసీ 2026'కు ఢిల్లీ కేబినెట్ ఆమోదం
- వినియోగదారులకు రూ.15,000 కోట్ల మేర ప్రయోజనాలు కల్పన
- ఎలక్ట్రిక్ వాహనాలకు 100 శాతం రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు
- కాలుష్య రహిత రాజధానిగా మార్చడమే ప్రధాన లక్ష్యం
- జూలై 1 నుంచి కొత్త పాలసీ అమల్లోకి వచ్చే అవకాశం

ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యాన్ని తగ్గించి, ఎలక్ట్రిక్ వాహనాల విని యోగాన్ని ప్రోత్సహించే దిశగా బీజేపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. "ఢిల్లీ ఈవీ పాలసీ 2026"కు తమ కేబినెట్ ఆమోదం తెలిపిందని ముఖ్యమంత్రి రేఖా గుప్తా **తరువాయి 2లో**

# అమర్‌నాథ్ యాత్రకు శ్రీకారం.. పవిత్ర గుహలో ప్రథమ పూజ



**2లో**

# 'రైతు భరోసా' విడుదల నేడే

హైదరాబాద్: రాష్ట్ర రైతులకు పంట పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా వానాకాలం సీజన్ నిధులు మంగళవారం విడుదల కానున్నాయి. మొదటి విడత కింద రెండు ఎకరాల వరకు భూమి ఉన్న 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ కానున్నాయి. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో సాయంత్రం నాలుగు గంటలకు జరిగే రైతు ఆశీర్వాద సభలో సీఎం రేవంత్‌రెడ్డి ల్యాప్‌ట్యాప్‌లో మీట నొక్కి నిధులను విడుదల చేస్తారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర శాసనసభ నియోజకవర్గ పరిధిలోని చింతకానిలో నిర్వహించ తలపెట్టిన రైతు ఆశీర్వాద సభను భారీ వర్షాల కారణంగా రద్దు చేసి.. సీఎం సూచనల మేరకు హైదరాబాద్ శిల్పకళా వేదికలో ఏర్పాటు చేశారు.

*** మొత్తం 73.32 లక్షల మందికి సాయం**

ఎకరానికి రూ.ఆరు వేల చొప్పున.. 73.32 లక్షల మంది రైతులకు చెందిన మొత్తం కోటిన్నర ఎకరాలకు రూ.9 వేల కోట్లు దశలవారీగా విడుదల చేయనున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా తెలిపారు. తొలి విడతలో రెండు ఎకరాల వరకు భూమి ఉన్న 41.37 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,482.02 కోట్లు జమ చేస్తాం అన్నారు. ఈ నిధుల విడుదలపై ప్రభుత్వం ముంబయిలోని రిజర్వ్ బ్యాంకు కార్యాలయానికి, హైదరాబాద్‌లోని రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బీసీ)కి, అన్ని బ్యాంకులకు ఈ నెల 27నే సమాచారం అందజేసింది. రుణ బకాయిల కింద మినహాయించుకోకుండా రైతుల ఖాతాల్లో ఈ భరోసా నిధులు పూర్తిగా జమ చేయాలని బ్యాంకులకు స్పష్టంగా సూచించింది.

**సకాలంలో సాయం -మంత్రి తుమ్మల**

"రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే వర్షాలు విస్తరిస్తుండటం, రైతులు విత్తనాలు వేసే కీలక సమయం కావడంతో పెట్టుబడి సాయాన్ని సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. శిల్పకళా వేదికలో నిర్వహించే కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 2,500 మంది రైతులు పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులు, ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు వారి జిల్లాల్లోని సమీప రైతు వేదికలకు చేరుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనాలి. కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు జులై 5 లోపు సమీప వ్యవసాయ విస్తరణాధికారిని కలిసి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పిస్తే వారు కూడా రైతు భరోసా పొందే అవకాశం లభిస్తుంది" అని మంత్రి తుమ్మల వివరించారు.

## రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపిన సీఎం

ఏరువాక పున్నమిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర రైతాంగానికి శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమాల వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలకు ఏరువాక పున్నమి శుభాకాంక్షలని చంద్రబాబు పేర్కొన్నారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు రైతులు భూమిని, పశుసంపదను పూజించి ప్రకృతితో అనుసంధానమయ్యే విశిష్టమైన పండుగ ఏరువాక అని ఆయన వివరించారు. పాడిపంటలతో రైతుల ఇళ్లలో వెలుగులు నిండాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా 'అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్' నిధులు జమ చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఎల్ నినో, అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా తలెత్తే సవాళ్లను రైతులు ధైర్యంగా అధిగమించాలని సూచించారు. ప్రకృతి సాగుతో పంటలు పండించి, మన భూమిని మరియు ఆరోగ్యాన్ని విషతుల్యం కాకుండా కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సూచనలు, సలహాలు పాటిస్తూ రైతన్నలు సాగులో సిరులు పండించాలని చంద్రబాబు ఆకాంక్షించారు.



## మరో రూ.2 వేల కోట్లు

హైదరాబాద్: ఉద్యోగులు, పింఛన్‌దారుల బకాయిల చెల్లింపుల కోసం మరో రూ.2 వేల కోట్లను విడుదల చేస్తూ ఆర్థికశాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. గత నెల(మే) 29న మొదటి విడతగా రూ.2 వేల కోట్లు విడుదల చేయగా సరిగ్గా అదే తేదీన ఈ నెల కూడా ఇచ్చింది. మొత్తం రూ.4 వేల కోట్ల చెల్లింపు పూర్తయింది. ఉద్యోగ జేఏసీ నాయకులకు ఇచ్చిన హామీ మేరకు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపు కోసం 100 రోజుల్లో రూ.6,000 కోట్లు విడుదల చేస్తామని ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విషయం తెలిసిందే.

**పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు..**

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందని ఆర్థికశాఖ తెలిపింది. అందులో భాగంగా రిటైర్డ్ ఉద్యోగులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు సంబంధించి చాలాకాలంగా పెండింగులో ఉన్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) బకాయిలను వంద శాతం చెల్లించింది. జీపీఎఫ్ ఖాతాల్లో ఎలాంటి పెండింగ్ బిల్లులు ఇక లేవని ప్రభుత్వం స్పష్టం చేసింది. విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి సెప్టెంబరు 2025 వరకు ఉన్న కమ్యూటేషన్ బకాయిలన్నింటినీ పూర్తిగా చెల్లించినట్లు వివరించింది. ఉద్యోగులు లేదా పింఛన్‌దారులు గతంలో ప్రభుత్వానికి పంపిన రూ.10 వేల లోపు ఉన్న దాదాపు 5 లక్షలకు పైగా బిల్లులను ప్రత్యేకంగా గుర్తించి వందశాతం చెల్లించినట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ, ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వ సానుకూల ధోరణి అభినందనీయమని కొనియాడారు. రాబోయే రోజుల్లో మిగిలిన బకాయిలను కూడా క్రమపద్ధతిలో చెల్లిస్తామని ఆర్థికశాఖ అధికారులు వెల్లడించారని వారు తెలిపారు.

## ఖమేనీ అంత్యక్రియలకు మోదీ దూరం

ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకావడం లేదు. ఆయన స్థానంలో బీహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అతా హస్నైన్, కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పవిత్ర మార్గెరిటా భారత ప్రతినిధులుగా పాల్గొననున్నారు. ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ ఇటీవల ప్రధాని మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. అయితే ఆ సమయంలో ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా పర్యటన ఇప్పటికే ఖరారు కావడంతో మోదీ హాజరు కాలేకపోతున్నారు. ఈ షెడ్యూల్ ముందుగానే ఖరారైందని అధికార వర్గాలు తెలిపాయి. ఫిబ్రవరి 28న అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మరణించారు. తొలుత మార్చిలో అంత్యక్రియలు నిర్వహించాలని భావించారు. కానీ ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా వాటిని వాయిదా వేశారు. ఇప్పుడు జులైలో పలువురు దేశాధినేతలు, ప్రతినిధుల సమక్షంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు శ్రీకారం.. పవిత్ర గుహలో ప్రథమ పూజ

ప్రతిష్ఠాత్మక శ్రీ అమర్‌నాథ్ జీ యాత్ర 2026 లాంఛనంగా ప్రారంభమైంది. సోమవారం పవిత్ర గుహాలయంలో 'ప్రథమ పూజ'ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొని, యాత్ర సన్నాహాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మంచులింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "హర హర మహాదేవ్! శ్రీ అమర్‌నాథ్ జీ పవిత్ర గుహలో ప్రథమ పూజ నిర్వహించడం నిజంగా నా అదృష్టం. ఇది వార్షిక యాత్రకు లాంఛనమైన ప్రారంభం. బాబా బర్ఫానీ ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి, శ్రేయస్సు, సంపూర్ణ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభమై, ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి, రక్షా బంధన్ పండుగలతో ముగుస్తుంది. మొత్తం 57 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. యాత్రను సురక్షితంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మనోజ్ సిన్హా తెలిపారు. "యంత్రాంగం, పుణ్యక్షేత్రాల బోర్డు, సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా దళాలు, స్థానిక ప్రజలు, సేవా ప్రదాతలు, వాలంటీర్లు అందరూ పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించడానికి సర్వం సిద్ధం చేశాం" అని ఆయన భరోసా ఇచ్చారు. భారీగా మెరుగుపరిచిన మౌలిక సదుపాయాలు, అదనపు సౌకర్యాలతో యాత్రికులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. అనంతనాగ్ జిల్లాలోని కశ్మీర్ హిమాలయాల్లో, సముద్ర మట్టానికి 3,880 అడుగుల ఎత్తులో ఈ పవిత్ర గుహ ఉంది. ఇక్కడి మంచుతో సహజసిద్ధంగా ఏర్పడే శివలింగాన్ని భక్తులు శివుని దివ్య శక్తులకు ప్రతీకగా భావిస్తారు. యాత్రికులు ప్రధానంగా రెండు మార్గాల ద్వారా గుహకు చేరుకుంటారు. సంప్రదాయ పహల్గామ్ మార్గంలో ప్రయాణానికి నాలుగు రోజులు పడుతుంది. అయితే, బల్తాల్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లే యాత్రికులు దర్శనం చేసుకుని అదే రోజు తిరిగి రావచ్చు.

**ఈ ఏడాది హెలికాప్టర్ సేవలు బంద్**

ఈ ఏడాది యాత్రలో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకుంది. బేస్ క్యాంపులైన పహల్గామ్, బల్తాల్ నుంచి పవిత్ర గుహకు వెళ్లే మార్గాన్ని 'నోఫ్లై జోన్'గా అధికారులు ప్రకటించారు. ఈ కారణంగా, ఈ యాత్రలో భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. యాత్రికులు ఈ మార్పును గమనించి, అందుకు అనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

## మూసీ పరిహారం.. పునరావాసంలో రాజీపడం

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో భూములు కోల్పోయే వారికి చట్టబద్ధంగా పరిహారం, అవసరమైన పునరావాసం కల్పించడంలో ప్రభుత్వం రాజీ పడబోదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఇళ్లు కోల్పోయే కుటుంబాలకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించేందుకు కార్యాచరణ రూపొందించి తక్షణమే అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ ప్రాజెక్టు భూసేకరణకు సంబంధించి మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలన్నారు. మూసీ భూసేకరణ, పునరావాసంపై సచివాలయంలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 'ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేసినట్లు... మూసీ ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. ఎవరికీ అన్యాయం జరగకుండా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అభివృద్ధి కార్యక్రమాల కారణంగా ఎవరి జీవితాలూ దెబ్బతినకుండా ప్రతి నిర్ణయాన్ని మానవీయ కోణంలోనే తీసుకుంటాం. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపడుతున్నాం. పర్యాటక, ఉపాధి, ఆర్థికాభివృద్ధికి కేంద్రంగా దీన్ని మార్చాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యం. మూసీ కాలుష్యంతో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వరదల సమయంలో పరీవాహక ప్రాంతాల వారు ఎదుర్కొంటున్న కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంది. వరద నియంత్రణ, నీటిశుద్ధి, పచ్చదనం పెంపు, రోడ్లు, పార్కులు, వినోద కేంద్రాల ఏర్పాటు ద్వారా పరీవాహక ప్రాంతాలను సరికొత్త జీవన కేంద్రాలుగా మార్చే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వెళ్తోంది' అని వివరించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డీఎస్ లోకేశ్‌కుమార్, స్టాంపులు రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్‌గాంధీ హనుమంతు, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ ఈవీ నర్సింహారెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్లు ప్రియాంక, నారాయణరెడ్డి, మనుచౌదరి పాల్గొన్నారు.

## ఢిల్లీలో పెట్రోల్ బైక్స్‌కు చెక్.. 2028 నుంచి రిజిస్ట్రేషన్ బంద్!

(మొదటిపేజీ తరువాయి)

సోమవారం ప్రకటించారు. ఈ కొత్త విధానం జులై 1 నుంచి అమల్లోకి వచ్చి, 2030 మార్చి 31 వరకు కొనసాగే అవకాశం ఉందని ఆమె తెలిపారు. ఈ పాలసీ ద్వారా రాబోయే నాలుగేళ్లలో పౌరులకు సుమారు రూ. 15,000 కోట్ల ప్రయోజనాలు చేకూరుతాయని సీఎం వివరించారు. ఇందులో భాగంగా, ప్రభుత్వం నేరుగా రూ. 7,000 కోట్లను ఛార్జింగ్ స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేయనుంది. మరో రూ. 8,000 కోట్లను పన్ను మినహాయింపులు, ప్రోత్సాహకాల రూపంలో ఈవీ వినియోగదారులకు అందిస్తుంది. లెఫ్టినెంట్ గవర్నర్ తరంజిత్ సింగ్ సంధు ఆమోదం తర్వాత ఈ పాలసీ అధికారికంగా అమల్లోకి వస్తుంది. ఈ కొత్త పాలసీలో భాగంగా, 2027 జనవరి 1వ తేదీ నుంచి ఢిల్లీలో కొత్త పెట్రోల్ లేదా సీఎన్‌జీ ఆటో రిక్షాల రిజిస్ట్రేషన్‌ను పూర్తిగా నిషేధిస్తారు. ఆ తర్వాత కేవలం ఎలక్ట్రిక్ ఆటోలకు మాత్రమే అనుమతి ఉంటుంది. అదేవిధంగా, 2028 ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త పెట్రోల్, సీఎన్‌జీ టూవీలర్ల రిజిస్ట్రేషన్లను కూడా నిలిపివేయనున్నారు. కొత్త విధానం ప్రకారం, ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసేవారికి 100 శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. కార్ల విషయానికొస్తే, రూ. 30 లక్షల లోపు ఎక్స్‌షోరూమ్ ధర ఉన్న వాహనాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు, కార్లు, తేలికపాటి గూడ్స్ ట్రక్కులు, గ్రామీణ సేవా వాహనాలతో సహా అన్ని రకాల వాహనాలకు ఈ పాలసీ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సాధారణ వాహనాలకు, ఎలక్ట్రిక్ వాహనాలకు మధ్య ధర వ్యత్యాసాన్ని తగ్గించడమే లక్ష్యంగా ఈ రాయితీలు రూపొందించినట్లు సీఎం రేఖా గుప్తా తెలిపారు. "కాలుష్య రహిత, స్వచ్ఛమైన రవాణా రాజధానిగా ఢిల్లీని మార్చడమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశం" అని ఆమె పేర్కొన్నారు. వాహనాల కొనుగోలును ప్రోత్సహించడమే కాకుండా, పాత వాహనాల తుక్కు (స్క్రాపింగ్), ఛార్జింగ్ మౌలిక సదుపాయాల కల్పనపై కూడా ఈ పాలసీ దృష్టి సారిస్తుందని ఆమె వివరించారు. ఈ పాలసీ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన కేబినెట్ మంత్రులు పంకజ్ కుమార్ సింగ్, ఆశిష్ సూద్, మంజిందర్ సింగ్ సిర్సాలను సీఎం

## కిమ్స్ ఆసుపత్రులకు 'ఏఏసీఐ' మల్టీసైట్ అక్రిడిటేషన్




హైదరాబాద్: కిమ్స్ గ్రూపు ఆసుపత్రులు అరుదైన గుర్తింపును సొంతం చేసుకున్నాయి. అమెరికన్ అక్రిడిటేషన్ కమిషన్ ఇంటర్నేషనల్ (ఏఏసీఐ) నుంచి ఏఏసీఐ మల్టీసైట్ అక్రిడిటేషన్ లభించింది. సోమవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆసుపత్రిలో ఏఏసీఐ గ్రూపు సీఈవో క్రెసో ఆంటోనియా పాలిస్కా చేతుల మీదుగా ఆసుపత్రుల సీఎండీ డాక్టర్ బి.భాస్కరరావు, ఇతర ప్రతినిధులు గుర్తింపు పత్రాలను స్వీకరించారు. ఏఏసీఐ మల్టీసైట్ అక్రిడిటేషన్ పొందిన ప్రపంచంలోనే తొలి హెల్త్‌కేర్ నెట్‌వర్క్‌గా కిమ్స్ ఆసుపత్రి నిలవడం విశేషమని డాక్టర్ భాస్కరరావు పేర్కొన్నారు. మొత్తం ఆసుపత్రుల నెట్‌వర్క్‌లోని సేవల్లో నాణ్యత ప్రమాణాలు రోగి భద్రత, క్లినికల్ ఎక్స్‌లెన్స్, పరిపాలన తదితర అంశాలను కొలమానంగా తీసుకొని ఈ గుర్తింపును అందించారన్నారు. కిమ్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సంబిత్ సాహు, ఏఏసీఐ రీజినల్ సీఈవో ధీరజ్ ఖతోరే, కిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ అనిత పాల్గొన్నారు.

## బంగాళాఖాతంలో పాక్ సబ్ మెరైన్ల కలకలం.. భారత్‌కు కొత్త ముప్పు!

ప్రొపల్షన్ (AIP) వ్యవస్థ వల్ల, బ్యాటరీలను రీఛార్జ్ చేయడానికి ఉపరితలానికి రాకుండానే మూడు వారాల పాటు నీటి అడుగున ఉండగలదు. ఇటీవల కరాచీలో నౌకాదళంలో చేరిన ఈ సబ్‌మెరైన్, శ్రీలంకలోని కొలంబోను సందర్శించి బంగాళాఖాతంలోకి తిరిగి వచ్చింది. మరోవైపు, బంగ్లాదేశ్‌లోని కాక్స్ బజార్ సమీపంలో చైనా నిర్మించిన బీఎన్ఎస్ పెకువా నౌకా స్థావరం కూడా ఆందోళనలకు కేంద్ర బిందువుగా మారింది. ఈ స్థావరంలో 8 యుద్ధ నౌకలు, 6 జలాంతర్గాములను నిలిపే సామర్థ్యం ఉంది. బంగ్లాదేశ్ వద్ద కేవలం రెండు సబ్‌మెరైన్‌లే ఉన్న నేపథ్యంలో, ఈ స్థావరాన్ని చైనా, దాని మిత్ర దేశాల నౌకలు ఉపయోగించుకుంటాయని స్పష్టమవుతోంది. "చైనా, పాకిస్థాన్ యుద్ధనౌకలు ఇక్కడకు వస్తే భారత్ ఏమీ చేయలేదు. వాటిని పర్యవేక్షించేందుకు అదనపు



బలగాలను మోహరించాల్సి వస్తుంది" అని భారత నౌకాదళానికి చెందిన ఓ రిటైర్డ్ వైస్ అడ్మిరల్ అభిప్రాయపడ్డారు. ఈ బేస్ చైనా, పాక్ సబ్‌మెరైన్‌లకు లాజిస్టిక్స్ హబ్‌గా మారే ప్రమాదం ఉందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ స్థావరం వ్యూహాత్మకంగా అండమాన్ నికోబార్ దీవులకు సుమారు 1,000 కిలోమీటర్ల దూరంలో, భారత తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్నం నుంచి కూడా దాదాపు అంతే దూరంలో ఉండటం గమనార్హం. బంగాళాఖాతంలో చైనా నౌకల కదలికలను ఎదుర్కోవడానికి భారత్ వద్ద శక్తిమంతమైన నిఘా వ్యవస్థ ఉన్నప్పటికీ, పొరుగు దేశాల స్థావరాలను ఉపయోగించుకుంటూ పాక్, చైనా జలాంతర్గాములు ఇంత సమీపంలో సంచరించడం తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది.

# మా వార్డు అభివృద్ధిపై నిర్లక్ష్యం ఎందుకు. కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్



భువనగిరి, ప్రజాస్పూర్తి : మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు అభివృద్ధిని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ ఆవేదన వ్యక్తం చేశారు. మొదటి కౌన్సిల్ సమావేశంలోనే ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కౌన్సిల్లో పెట్టమని ఎండార్స్ చేసిన, మున్సిపల్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన బాబు జగ్జీవన్ రామ్ భవన్ మరమ్మతులు, అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని కోరినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆమె విమర్శించారు.అదేవిధంగా, 23వ వార్డులోని స్థలంలో ఓంకార్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఏర్పాటు చేసే వినాయక మండపానికి శాశ్వత భవనం నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని, అయితే ఆ ప్రతిపాదనను ఇప్పటి వరకు కౌన్సిల్లో ప్రవేశపెట్టకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ కౌన్సిల్ ఆమోదం కోసం ప్రతిపాదించిన బిల్లులు కోట్ల రూపాయల ప్రజాధనం ఏ విధంగా వృధా అవుతుందో కాంట్రాక్టర్లకు బిల్లులు ఇచ్చి కమిషన్లు పొందాలని తాపత్రయం తప్ప వార్డుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి 23వ వార్డు అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే ప్రారంభించాలని కౌన్సిలర్ బర్రె పూజిత జహంగీర్ డిమాండ్ చేశారు.

# ప్రగతి సేవా సమితి సారధ్యంలో ఉచిత కంటి పరీక్షల నిర్వహణ



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి : కురవి మండలం సూధనపల్లి గ్రామంలో బస్టాండ్ సెంటర్ లో ఉన్నటువంటి గ్రామపంచాయతీ ఆవరణంలో జిల్లా అంధత్వ నిర్మూలనలో భాగంగా ప్రగతి సేవా సమితి సారాధ్యంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధుల కు కంటి పరీక్షలు నిర్వహిస్తూ! కంటి ఆపరేషన్ అవసరం ఉన్న వారిని శంకర కంటి ఆసుపత్రిలో ఉచిత కంటి ఆపరేషన్ చేపించి వారి యొక్క ఆరోగ్య స్థితిగతులను గమనిస్తూ ప్రగతి సేవా సమితి సిబ్బంది ద్వారా గ్రామాలలో జనరల్ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ గ్రామ ప్రజల ఆర్థిక, అనారోగ్య సమస్యలను పరిష్కరిస్తుందని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి సూదనపల్లి గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న మరియు గ్రామ ఉప సర్పంచ్ వెంపటి విజయ్ పాలక మండలి సభ్యులు కంటికి సంబంధించిన క్యాంపు లు నిర్వహిస్తాము. అని అడగగానే స్పందించి ప్రగతి సేవా సమితికి సహకరించారు. గ్రామ ప్రజలకు జనరల్ చెకప్ డాక్టర్ల ద్వారా గ్రామపంచాయతీలో నిర్వహిస్తామని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీలం వెంకన్న,ఉప సర్పంచ్ వెంపటి విజయ్ ,పాలకమండలి సభ్యులు, మాజీ ఉప సర్పంచ్ నాగనబోయిన మహేందర్ , కురవి ఆలయ మాజీ ధర్మకర్త కన్నెగంటి వెంకటరమణ ,గ్రామ పెద్దలు దుస్సా మల్సూర్ డాక్టర్ ఏ,సుస్మితా ఆప్తమాలజిస్ట్,బి, రాజు, ఇ ,మేఘన, ప్రగతి సేవా సమితి జిల్లా కోఆర్డినే కోఆర్డినేటర్ పసునూరి యాకయ్య,కురవి మండల కోఆర్డినేటర్ నాగనబోయిన అజయ్,సూధనపల్లి గ్రామ కో ఆర్డినేటర్ గాండ్ల సందీప్, వివిధ గ్రామాలనుండి వచ్చిన వృద్ధులు, గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తాం

* **మూసీ ప్రాజెక్టు నుంచి కాల్వలకు నీటి విడుదల**



ప్రజాస్పూర్తి, సూర్యాపేట: ప్రతి ఎకరానికి నీరు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వ విప్, నకిరేకల్ శాసన సభ్యులు వేముల వీరేశం,ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట మండలం రత్నాపురం ఎడమకాల్వకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తామని తెలిపారు. మూసీ ఆయకట్టు కింద పొలాలకు రెండు పర్యాయాలుగా నీరందిస్తామన్నారు. వానా కాలంలో ప్రాజెక్టు కింద 35 వేల ఎకరాల మేర సాగు నీరందుతుందని అన్నారు. హైదరాబాద్‌లో కురిసిన వర్షంతో మూసీ ప్రాజెక్టులో సమృద్ధిగా నీరు చేరిందని అన్నారు. ప్రస్తుతం మూసీ ప్రాజెక్టులో నాలుగు టీఎంసీల నీరుందని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కోట్ల రూపాయలతో ఎడమ కాల్వల మరమ్మతుల పనులు,క్రస్ట్‌గేట్లు ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. మూసి ప్రాజెక్టు ను పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. ఎలాంటి ఆటంకాలు ఎదురైనా అధిగమించి మూసీ నది ప్రక్షాళన పూర్తి చేసి తీరుతామని నిన్నటి సభలో ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి , జిల్లా మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సింగరేణి పంపు బాయి డ్రైనేజీ సమస్యలపై కలెక్టర్ కు వినతి



కొత్తగూడెం ,ప్రజాస్పూర్తి : కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని లక్ష్మీదేవి పల్లి మండలం సంజయ్ నగర్ గ్రామపంచాయతీ లోగల సింగరేణి పంపు బాయి ఏరియాలో నివసిస్తున్న ప్రజలు స్థానిక డ్రైనేజీ సమస్యలపై గ్రీవెన్స్ లో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు . వెంటనే స్పందించిన డిపిఓ శిరీష పంపు బాయి ఏరియాలో డ్రైనేజీ సమస్యలను పరిశీలిస్తూ వారం రోజుల్లో డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు . వెంటనే స్పందించిన డిపిఓ శిరీష కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు . ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ విజయ , సాయి , రమాదేవి , కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు .

# పర్యావరణ సామాజికవేత్త కె. రవీందర్ ముదిరాజ్ కు సేవ శిరోమణి అవార్డు



జీడిమెట్ల, ప్రజాస్పూర్తి : పర్యావరణ సామాజికవేత్త కె. రవీందర్ ముదిరాజ్ కు సేవ శిరోమణి అవార్డు లభించింది. ఈ సందర్భంగా నగరంలోని రవీంద్ర భారతీలో సూర్యచంద్ర కల్చర్ ఆర్గనైజర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్ , ప్రముఖ పారిశ్రామికవేత్త చల్లా రాజశేఖర్ రెడ్డి, ప్రముఖ జ్యోతిష్యులు భాగ్యలక్ష్మి రెడ్డి, రిటైర్డ్ సీఐ ఎక్సైజ్ ఎండి హమీద్ పాల్గొని రవీందర్ చేస్తున్నటువంటి సామాజిక సేవను గుర్తు చేసుకుంటూ ప్లాస్టిక్ పై నిరంతరం పోరాడుతూ ప్రతి పాఠశాలకు వెళ్లి ఈతి ఒక సాధన అని పిల్లలకు అవగాహన కల్పిస్తూ నీటిని పొదుపుగా వాడాలని ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఉండాలని అవగాహన కల్పిస్తున్నటువంటి రవీందర్ ముదిరాజ్ ని ఘనంగా సన్మానించి సేవ శిరో శిరోమణి అవార్డు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేస్తూ అనుభవమున్న పనిని ఎన్నుకొని ముందుకు సాగాలన్నారు. న్యాయాన్ని గౌరవిస్తూ యువత ముందుకు సాగాలన్నారు. శాయ శక్తుల ఇతరులకు సహాయ పడాలని అన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చెల్లా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ యువత మంచి చదువులు చదువుకొని టెక్నికల్ విద్య నేర్వాలన్నారు. యువతకు ఉపాధి కల్పించే ఆలోచన ఉండాలని యోగా ఒక దినచర్యగా పాటించాలన్నారు. యోగ వల్ల సర్వరోగ నివారిణి అవుతుందని యోగాన్నిపులను కొనియాడుతూ యోగ చేస్తున్నటువంటి విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎక్సైజ్ సిఐ ఎండి హమీద్ , ప్రముఖ జ్యోతిష్కురాలు భాగ్యలక్ష్మి పాల్గొని ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ నాకు బాధ్యత పెరిగిందని ఇకముందు సమాజ సేవకు కొద్ది సమయం కేటాయిస్తానని అందరి సహకారం ఉంటే ఏ పనైనా సాధించవచ్చు అని ప్రతి మనిషికి పట్టుదల కసి ఉండాలని రవీందర్ ముదిరాజ్ అన్నారు..

# సర్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి: దుద్దిళ్ల శ్రీను బాబు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, కాటారం, ప్రజాస్పూర్తి : ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం మండల కేంద్రం ధన్వాడలో సోమవారం నిర్వహించిన బీఎల్ఎ సూపర్వైజర్ల అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాటారం, మహాదేవపూర్, మల్హర్, మహాముత్తారం,పలిమెల మండలాలకు చెందిన ప్రతినిధులకు సర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రతి బూత్ పరిధిలో BLAలు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. కొత్తగా అర్హత పొందిన ఓటర్ల పేర్లు నమోదు చేయించడం, తప్పులు సవరించడం, అర్హుల పేర్లు తొలగిపోకుండా చూడడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆ హక్కు అందేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు, బీఎల్ఎ సూపర్వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కల్తీ ఎరువులు, విత్తనాలు, మందులను అరికట్టాలి

* **జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేత.**



నల్లగొండ,ప్రజాస్పూర్తి : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలని, రైతులను ఇబ్బందులకు గురిచేసే యూరియా యాప్ ను వెంటనే వెత్తి వేయాలని, కల్తీ ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులను అరికట్టాలనీ సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గ్రీవెన్స్ డే సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘంనల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏ.ఐ.కె.ఎం.ఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి లు మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు యూరియా ఇస్తామనడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా యూరియా యాప్ ను అప్డేట్ చేసుకోవాలనడంతో స్మార్ట్ ఫోన్ లేని రైతులు, పట్టాబుక్ నెంబర్ కి ఫోన్ నెంబర్ లింక్, సాగు విస్తరణ ధ్రువీకరణ అడగడం, యూరియా ను ఒకేసారి ఇవ్వకుండా దశల వారిగా ఇస్తామనడం అవగాహనా లేని, ఫోడ్లు లేని రైతులను తిప్పలు పెట్టడమేనని అన్నారు. మరోవైపు రైతులు అప్పులు చేసి వ్యవసాయం చేస్తే దళారీ కంపెనీలు కల్తీ ఎరువులు, విత్తనాలు, మందులు అంటగడుతున్నారని అన్నారు. బ్లాక్ మార్కెట్ లో ఎరువుల కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మే ఫెర్టిలైజర్ షాపు లపై చర్యలు తీసుకోవాలని అన్నారు. సకాలంలో రైతులకు రైతు బంద్ ఇవాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల వరి పంటలకు ఐదు వందలు బోనస్ చెల్లించాలని, సబ్సిడీ ద్వారా రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఈ కార్య క్రమంలో ఏ.ఐ.కే.ఎం.ఎస్ జిల్లా ఉపా ధ్యక్షులు గజ్జి రవి, వేముల శంకర్, నాయకులు సుంచు బిక్షం, బి.వి చారి తదితరులు పాల్గొన్నారు.

# ఈ సారి బుల్లెట్ దిగుద్ది ఇక సూర్యాపేట మిస్ కాదు



ప్రజాస్పూర్తి, సూర్యాపేట: గత ఎన్నికల్లో మా రాంరెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు సర్వోత్తమ్ రెడ్డి ఇంత చురుకుగా ఉంటే సూర్యాపేట మిస్ అయ్యేది కాదని ఈసారి బుల్లెట్ దిగుద్దని ఇక సూర్యాపేట మిస్ కాదని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దామన్న తనయుడు సర్వోత్తమ్ రెడ్డి గురించి మాట్లాడారు. దామన్న అమరత్వం పొందే వరకు ఆయన వ్యక్తిత్వాన్ని దగ్గర నుంచి చూసిన నాయకుల్లో నేను ఒకడినని దామన్నను దూరం నుంచి చూసి పులి అని భయపడేదని కానీ దగ్గర నుంచి చూస్తేనే దామన్నకు ప్రజల పట్ల ఉన్న అంకితబావం తెలిసిందన్నారు. తనను నమ్మిన ప్రజల కోసం వందలాది ఎకరాల భూమిని, ఆస్థులను దారపోసిన ఏకైక కాంగ్రెస్ నాయకుడు దామోదర్ రెడ్డి అన్నారు. దామన్న బాటలోనే ఆయన తనయుడు సర్వోత్తమ్ రెడ్డి ప్రజలకు సేవ చేస్తానని నాన్న ఆశయాలను ముందుకు తీసుకుపోతానని ప్రజలకు అండగా ఉంటానని మీ ముందుకు వస్తున్నాడన్నారు. విజ్ఞానవంతుడు మీ కోసం నిలబడే కమిట్ మెంట్ ఉన్న వ్యక్తి సర్వోత్తమ్ రెడ్డి అని అవినీతి రహిత పాలన అందించాలనే ఆలోచనతో వస్తున్న ఇలాంటి నాయకుడికి మనమంతా అండగా ఉండాలన్నారు. సర్వోత్తమ్ రెడ్డికి ఇప్పటికే ఉత్తమన్న అండదండ మెండుగా ఉందని ఉత్తమన్న నాయకత్వంలో ముందుకు పోతుందని మా అన్న కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి చాలా చక్కగా పని చేసుకుంటూ పోతుండనే అభిప్రాయం ఉందన్నారు. మంత్రుల అండదండలు సర్వోత్తమ్ రెడ్డి కి ఉన్నాయని ప్రజలంతా సర్వోత్తమరెడ్డిని ఆదరించి వెంట నడవాలని పిలుపునిచ్చారు.

# జూలై 1 ధర్నా విజయవంతం చేయాలి: జేఏసీ




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్పూర్తి : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వం వెంటనే 12వ వేజ్ బోర్డు కమిటీని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో జూలై 1న కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ఎదుట నిర్వహించే 'డిమాండ్స్ డే' ధర్నాను విజయవంతం చేయాలని జాతీయ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం భూపాలపల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి పసునూటి రాజేందర్, ఏఐటీయూసీ నాయకుడు మోటపలుకుల రమేష్, హెచ్ఎంఎస్ నాయకులు కె. నరేష్, జూపల్లి మల్లేష్, సీఐటీయూ నాయకుడు దుడ్డేల సాయిలు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను యాజమాన్యం పదేపదే విస్మరిస్తోందని ఆరోపించారు. మెడికల్ బోర్డు, సొంతింటి పథకం, పెర్క్విజిట్స్‌పై ఆదాయపు పన్ను రద్దు తదితర సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. కేంద్ర ప్రభుత్వం 12వ వేజ్ బోర్డు కమిటీ ఏర్పాటులో జాప్యం చేస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. వెంటనే కమిటీని ఏర్పాటు చేసి వేజ్ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ ఐ ఆర్ పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దు



మహబూబాబాద్, ప్రజాస్పూర్తి: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ "సర్" పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు.మహబూబాబాద్ జిల్లా,గూడూరు మండలం, మాచర్ల గ్రామంలోని ఆయన సొంత ఇంటిలో బి.ఎల్.ఏ లు ఇచ్చిన ఓటర్ లిస్టును నింపి గూడూరు మండల తహసిల్దార్ నాగ భవానికి అందజేశారు.ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి బి ఎల్ ఏ లు వస్తుంటారని వారిచ్చిన ఫారంను సమగ్రంగా నింపి వారికి అందజేయాలని సూచించారు.గ్రామంలో మృతి చెందిన,డబుల్ ఓటర్ లిస్టులో పేర్లు ఉన్న వాటిని మాత్రమే తొలగిస్తున్నారని చెప్పారు. ఓటర్ లిస్ట్ పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

# కేజీబీవీ పాఠశాలలో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలి

* **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు**



భువనగిరి, ప్రజా స్పూర్తి : కలెక్టరేట్ మినీ మీటింగ్ హాలులో సోమవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ స్పెషల్ ఆఫీసర్స్ తో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు,జిల్లా విద్యశాఖ అధికారి బిక్షపతి తో కలిసి సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఇంకా పూర్తికాని పనులపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పెండింగ్‌లో ఉన్న నిర్మాణ, మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.విద్యార్థినులకు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిధిలో వీధి కుక్కలను లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా అన్ని పనులను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను అదనపు కలెక్టర్ ఆదేశించారు. పనులలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాఠశాల ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ ఓ తాగునీటి ప్లాంట్ ను ప్రారంభం



భువనగిరి, ప్రజాస్పూర్తి : జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చే ప్రజలు, పోలీసు అధికారులు , సిబ్బందికి స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో 500 ఎల్పీహెచ్ సామర్థ్యం గల ఆర్.ఓ. తాగునీటి ప్లాంట్‌తో పాటు షెల్టర్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు.ఈ ఆర్.ఓ. ప్లాంట్‌ను యాదాద్రి భువనగిరి జిల్లా పోలీసు సూపరింటెండెంట్ శ్రీ అక్షాన్ష్ యాదవ్ ప్రారంభించారు. దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా రూ. 9.75 లక్షల వ్యయంతో ఈ ప్లాంట్‌ను నిర్మించి జిల్లా పోలీసు శాఖకు అందజేసింది.ఈ సందర్భంగా ఎస్పీ శ్రీ అక్షాన్ష్ యాదవ్, మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది , కార్యాలయానికి వచ్చే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం ఎంతో అవసరమని తెలిపారు. ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసినందుకు దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐలు , ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది, దివిస్ లాబొరేటరీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వర్షాకాల ట్రాఫిక్ సమస్యల నివారణకు సమగ్ర కార్యాచరణ

* **కీలక ఆదేశాలు జారీ చేసిన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్**





సైబరాబాద్ ప్రజాస్ఫూర్తి: వర్షాకాలంలో ట్రాఫిక్ అంతరాయాలు, వాటర్ లాగింగ్ సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం. రమేష్ అధ్యక్షతన జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్, ట్రాఫిక్ అడ్మిన్ ఏడీసీపీ నరేందర్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ట్రాఫిక్ డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు. సమావేశంలో సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని వాటర్ లాగింగ్ ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. గ్రేహౌండ్స్ మరియు ఆక్టోపస్ కు చెందిన సుమారు 150 మంది సిబ్బందిని ట్రాఫిక్ విధుల్లో పోలీస్ స్టేషన్‌ల వారీగా ఎలా వినియోగిస్తున్నారనే అంశంపై సమీక్ష నిర్వహించి, అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. జంక్షన్ల వద్ద ఫ్రీ లెఫ్ట్‌లు, యూటర్న్‌లను అడ్డుకునే వాహనాలపై మరియు రాంగ్ రూట్లో వెళ్లే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైన చోట ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాటర్ లాగింగ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం సమస్యలు తలెత్తే ప్రాంతాలపై సమగ్ర మాస్టర్ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని, రోడ్డు కటింగ్ పనులు చేపట్టే ముందు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని ట్రాఫిక్ మళ్లింపు ప్రణాళికలను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. విప్రో జంక్షన్, డీఎల్ఎఫ్ జంక్షన్, షాపూర్ నగర్, కూకట్‌పల్లి వైజంక్షన్, మియాపూర్, నిజాంపేట్ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది తప్పనిసరిగా రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోట్లు ధరించాలని కమిషనర్ సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు సురక్షితమైన, అంతరాయం లేని ప్రయాణాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని, ట్రాఫిక్ నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ఆయన స్పష్టం చేశారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అల్పాహార వితరణ



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండలం కల్మలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు ఒక నెల పాటు ప్రతిరోజు ఉదయం పూట అల్పాహారం అందించుటకు కల్మలచెరువు గ్రామ వార్డు మెంబర్ ఏవీ రెడ్డి ముందుకు వచ్చినారు . ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాత ఏవీ రెడ్డి ముందుకు రావడం హర్షనీయమని పేర్కొన్నారు.అలాగే మరుసటి నెలపాటు మాజీ సర్పంచ్ కుకూనురి అంజయ్య అ తరువాత నెలలో ఎస్ఎస్సీ 198889 సంవత్సరపు పూర్వం విద్యార్థులు అల్పాహారం అందించుటకు ముందుకు రావడం జరిగింది.వీరందరికి పాఠశాల తరుపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇట్టి కార్యక్రమాన్ని పాఠశాల నందు ప్రారంభించి విద్యార్థులకు అల్పాహారంను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బచ్చలకూరి శ్రీను అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ పాశం అరుణ అల్పాహార దాత ఏవీ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిడమర్తి వీరబాబు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నానో ఎరువుల పై అవగాహన కార్యక్రమం




గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి : కె వి కె గడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో గరిడేపల్లి మండలంలోని గారకుంట తండాలో సోమవారం నాడు ఖేత్ బచావో అభియాన్" (నేలలను రక్షించుకుందాం) కార్యక్రమంలో భాగంగా నానో ఎరువుల వాడకంపై అవగాహన కల్పించినట్లు కే.వి. కే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త అండ్ హెడ్ ఇంచార్జ్ డి.నరేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ భూసారాన్ని కాపాడటానికి, సంప్రదాయ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి నానో ఎరువులు వాడాలి అన్నారు. అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గిపోతోంది. వీటి వాడకాన్ని తగ్గించి, ప్రతి రైతు తన భూసార పరీక్షలు చేయించుకొని, భూమికి అవసరమైన పోషకాలను, దీని ద్వారా సాగు ఖర్చులు తగ్గుతాయి. సుస్థిర వ్యవసాయం వాతావరణ మార్పులను తట్టుకుంటూ, ఎక్కువ దిగుబడి సాధించే ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై అవగాహన ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గడ్డిపల్లి కే వి కే శాస్త్రవేత్త ఎ.కిరణ్, ప్రోగ్రామ్ అసిస్టెంట్ ఎన్. సుగంధి, ఇఫ్కో మేనేజర్ ఎ.వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ బానోతు అరుణ ఉపసర్పంచ్ గౌతమి సుధాకర్ బి. హేమ్లా నాయక్, నరేందర్ నాయక్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికులకు తాగునీరు అందించండి

* **గంగ ఫిల్టర్ బెడ్ వద్ద మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : భూపాలపల్లిలోని గంగ వాటర్ ఫిల్టర్ బెడ్‌ను మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సోమవారం పరిశీలించారు. సింగరేణి కార్మికులు, స్థానికులకు తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు, కార్మికులు, కౌన్సిలర్లు తెలియజేయడంతో ఫిల్టర్ బెడ్‌ను సందర్శించినట్లు తెలిపారు. పరిశీలనలో పాత మోటార్లు దెబ్బతినడం, కొన్ని పనిచేయకపోవడంతో నీటి సరఫరా ప్రభావితమవుతోందని గుర్తించారు.సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పనిచేయని మోటార్లను అత్యవసరంగా మరమ్మతు చేసి తాగునీటి సరఫరాను వెంటనే పునరుద్ధరించాలని కోరారు. కార్మికులు, ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. కార్మికుల సంక్షేమం, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం తగదని గండ్ర పేర్కొన్నారు.

## వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

* **స్టెరిలైజేషన్‌తో జనాభా నియంత్రణ.. రేబీస్ నివారణే లక్ష్యం**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : పట్టణంలో వీధి కుక్కల సంఖ్యను నియంత్రించి ప్రజల భద్రతను మెరుగుపరచేందుకు మున్సిపాలిటీ యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్ తెలిపారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ కేంద్రానికి తరలించి, అక్కడ పశువైద్యుల పర్యవేక్షణలో శస్త్రచికిత్సలు నిర్వహించిన అనంతరం వాటిని తిరిగి అదే ప్రాంతాల్లో విడిచిపెడతామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా వీధి కుక్కల జనాభా పెరుగుదలను నియంత్రించడంతో పాటు రేబీస్ వంటి వ్యాధుల నివారణకు కూడా దోహదపడుతుందని వివరించారు.వీధి కుక్కలను పట్టుకునే సమయంలో మున్సిపల్ సిబ్బందికి ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు. అలాగే వీధి కుక్కల సమస్యలపై సమాచారం అందించాలనుకునే వారు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల వాగ్వాదం

* **బడ్జెట్ ఆమోదం**





ప్రజాస్ఫూర్తి , నల్లగొండ : సోమవారం జరిగిన నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సాధారణ సమావేశంలో డివిజన్ కార్పొరేటర్ల మధ్యన తీవ్ర వివాదం నెలకొనగా గందరగోళం ఏర్పడింది. కాంగ్రెస్ బిఆర్ఎస్ కార్పొరేటర్ల మధ్య వాగ్వాద ము చోటుచేసుకుంది. నగరాభివృద్ధి నిధుల కేటాయింపులపై తప్పుడు ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని అధికారపక్ష కార్పొరేటర్లు ఘాటుగా హెచ్చరించగా బెదిరిస్తే భయపడేది లేదని ప్రతిపక్ష కార్పొరేటర్లు సమాధానం ఇచ్చారు. ఇద్దరు ముగ్గురు కార్పొరేటర్లు నువ్వెంత అంటే నువ్వు ఎంత అని వాదించడంతో గందరగోళంగా మారింది. కాలనీలో మూడేళ్లు అయిన అభివృద్ధి జరగలేదని రెండవడివిజన్ కు నిధులు ఇవ్వడం లేదని ఆ డివిజన్ టిఆర్ఎస్ కార్పొరేటర్ పెరిక యాదయ్య వ్యాఖ్యానించడంతో 21 డివిజన్ కాంగ్రెస్ కార్పొరేటర్ ఇబ్రహీం అభ్యంతర వ్యక్తం చేస్తూ వందల కోట్ల అభివృద్ధి పనులు నడుస్తున్నాయని గత నెలలో ప్రతి డివిజన్కు రూపాయలు పది లక్షల కేటాయిస్తే నిధులు ఇవ్వలేదని తప్పుడుగా గెలిచేయడం సరికాదు అనడంతో ఇరువురి మధ్యన వాగ్వాదం ప్రారంభమైంది మధ్యలో మరో టిఆర్ఎస్ కార్పొరేటర్ దొడ్డి రమేష్ మాట్లాడుతూ దానికి కాంగ్రెస్ కార్పొరేటర్ ఇంతియాజ్ కౌంటర్ చేయడంతో సమావేశం నిర్వహించడం మారింది దాంతో నగర మేయర్ బుద్ధి చైతన్య శ్రీనివాసరెడ్డి 31 డివిజన్ కార్పొరేటర్ మారవుడి నవీన్ కుమార్ తిరుపతి లకు కార్పొరేటర్లకు వారించడంలో వాగ్వాదం చదవండి అనంతరం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సభలో సభ్యులు ఆవేశానికి లోనుకోకుండా మాట్లాడాలని పార్టీలకతీతంగా నగరంలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు పాలకవర్గం ఏర్పడి నాలుగైదు నెలలు అయిందని ఇంతలోనే అన్ని సమస్యలు పరిష్కారం కావన్నారు మంత్రి కోమటిరెడ్డి సహకారంతో అన్ని డివిజన్లోని గల్లి గల్లిలో సిసి రోడ్లు నిర్వహిస్తామని డ్రైనేజీ కాలువలు నిర్మిస్తామన్నారు. తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు సమావేశంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్చంద్ర అధికారులు కార్పొరేటర్లు పాల్గొన్నారు

## మాదిగల ఓట్లు మాదిగలకే వేసుకుంటే రాజ్యాధికారం మనదే

* **మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం దిశగా మాదిగ మహాశక్తి పోరాడుతుందని మాదిగ మహాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు పేర్కొన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని విఆర్ఎన్ గార్డెన్‌లో పార్నంది రామయ్య అధ్యక్షతన జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోత్కుపల్లి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మాదిగలు, బీసీ వర్గాలే ఎక్కువ జనాభా ఉన్నారని, మన ఓట్లు మనకే వేసుకుంటే ప్రజాప్రతినిధులుగా ఎన్నికవుతామన్నారు. అగ్రవర్ణాల నేతలు మాదిగలను ఓట్ల కోసమే ఉపయోగించుకుంటున్నారని, అందుకే బలహీన వర్గాలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. మాల సామాజిక వర్గానికి చెందిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి వివేక్ వెంకటస్వామి, అతని సోదరులు మాదిగ వర్గాన్ని రాజకీయంగా అణచివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలతో పనిచేస్తుందని, రానున్న రోజుల్లో భూస్థాపితం కాక తప్పదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 70 లక్షల జనాభా గల మాదిగలు, బీసీలు 50 శాతం బహుజనులంతా రాజ్యాధికారం కోసం ఏకం కావాలని పిలుపునిచ్చారు. "నా గొంతులో ప్రాణం ఉన్నంతవరకు నా జాతి బిడ్డల హక్కుల కోసం పోరాడుతాను" అని స్పష్టం చేశారు. అనంతరం నాయకులు గజమాలతో మోత్కుపల్లి నరసింహులును ఘనంగా సన్మానించారు. ఈ సభలో బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగౌని బాలరాజ్ గౌడ్, ఐలి నరహరి, గుండాల నరసయ్య, చిలుక స్వామి మాదిగ, విజయ్ కుమార్ మాదిగ, సోమారపు వీరస్వామి, అంబాల కృష్ణయ్య మాదిగ పల్లె రాములు మాదిగ, అంబాల లక్ష్మయ్య మాదిగ, జల్లె శ్రీనివాస్, బుచ్చిబాబు మాదిగ, భాస్కర్ మాదిగ, మంగళపల్లి రాజు, రామకృష్ణ, సుధాకర్, కట్కూరి రజిని, కర్ణాకర్, తెలుగు రచయిత, టీచర్ సోమారపు యాకమ్మ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో వెల్ది మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్‌కు ద్వీగుణ గౌరవ పురస్కారాలు



జనగామ, ప్రజాస్ఫూర్తి : జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని వెల్ది తెలంగాణ మోడల్ స్కూల్, ఆంగ్ల ఉపాధ్యాయుడు కందగట్ల గణేష్ అంతర్జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్ఠాత్మక గౌరవ పురస్కారాలను అందుకొని పాఠశాలకు విశిష్ట గుర్తింపు తీసుకువచ్చారు. దక్షిణాఫ్రికాకు చెందిన గ్లోబల్ రాయల్ కింగ్‌డమ్ - పిలర్స్ ఆఫ్ పీస్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచ శాంతి, మానవతా విలువలు, కుటుంబ వ్యవస్థ బలోపేతానికి చేసిన విశిష్ట సేవలను గుర్తించి గణేష్‌కు "గౌరవ ప్రశంసా పత్రం"ను ప్రదానం చేసింది. ఆయన సమాజ సేవా దృక్పథం, మానవతా విలువల పరిరక్షణలో చూపిన అంకితభావానికి ఈ గౌరవం లభించింది. అదేవిధంగా నైజీరియాకు చెందిన అంతర్జాతీయ విద్యా సంస్థ ఎ వాక్ త్రూ ఎడ్యుకేషన్ - గ్లోబల్ ఇంటెలెక్చువల్ ఎక్స్ఛేంజ్ విద్యారంగంలో ఆయన చూపిన నిరంతర కృషి, విశిష్ట ప్రతిభ, అంకితభావాన్ని గుర్తించి "త్రైమాసిక అత్యుత్తమ ప్రతిభా పురస్కారం" ను ప్రదానం చేసింది. ప్రపంచ విద్యా సమాజంలో ఆయన అందించిన సేవలకు ఈ పురస్కారం ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది. ఈ సందర్భంగా వెల్ది తెలంగాణ మోడల్ స్కూల్, ప్రిన్సిపాల్ పాలకుర్తి శ్రీధర్ కందగట్ల గణేష్‌ను అభినందించారు. అంతర్జాతీయ వేదికలపై పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావడం ప్రతి ఉపాధ్యాయునికి స్ఫూర్తిదాయకమని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయశ్రీ, గాజర్ల రుద్రమదేవి, పార్వతి, సౌజన్యప్రియ, కట్ట రాజు, షహానా సుల్తానా, దారం శ్రీను, వినీల, తుమ్మ రవి, శశికుమారి, మాలతి, వసంత మాధురి, లలిత, బాలరాజు, మరపాక రాజయ్య మరియు గుగులోత్ బాలరాజు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బంది కందగట్ల గణేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఆయన సాధించిన ఈ రెండు అంతర్జాతీయ గౌరవాలు పాఠశాలకు, రఘునాథపల్లి మండలానికి, జనగామ జిల్లాకు గర్వ కారణమని కొనియాడారు

## గ్రీవెన్స్‌లో స్పందించిన కలెక్టర్

* **వారం రోజుల్లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: లక్ష్మీదేవిపల్లి సంజయ్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని సింగరేణి పంప్‌హౌస్ ఏరియాలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలపై స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు సోమవారం నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.వినతిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయగా, జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శిరీష , సింగరేణి పంప్‌హౌస్ ఏరియాను సందర్శించి మురుగునీటి కాలువలను పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులతో చర్చించిన డీపీఓ శిరీష, వారం రోజుల్లో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.దీనిపై కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌కు, డీపీఓ శిరీషకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సాయి, రమాదేవి, కృష్ణయ్య, వార్డ్ సభ్యురాలు విజయతో పాటు కాలనీవాసులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారుల నిరసనలకు గండ్ర సంఘీభావం

* **డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : సింగరేణి చరిత్రలో తొలిసారిగా అధికారులు సైతం నిరసన బాట పట్టడం ప్రభుత్వంపై నెలకొన్న అసంతృప్తికి నిదర్శనమని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి జీఎం కార్యాలయం ఎదుట సింగరేణి అధికారులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఆయన సోమవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం, యాజమాన్యం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చకముందే ప్రభుత్వం, యాజమాన్యం చొరవ తీసుకుని అధికారులతో చర్చలు జరిపి పరిష్కారం చూపాలని కోరారు. కేంద్ర బొగ్గు శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుని సింగరేణి అధికారుల డిమాండ్ల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గండ్ర వెంకట రమణారెడ్డి విజ్ఞప్తి చేశారు.

## ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని పర్యవేక్షించిన కలెక్టర్



ప్రజాస్ఫూర్తి,మెదక్ జిల్లా:ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసమే ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని,ఓట్లు తొలగిస్తారనే అపోహలను ఎవరూ నమ్మ వద్దని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమైన (సర్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించారు. అందులో భాగంగా మెదక్ జిల్లా కేంద్రంలోని మెదక్ మున్సిపాలిటీ లోని గాంధీనగర్ పిఎస్ నెంబర్ 135లో సర్ ను తాసిల్దార్, లక్ష్మణ్ బాబు డిప్యూటీ తాసిల్దార్‌తో కలిసి కొనసాగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని కలెక్టర్ పరిశీలించారు. అంతేకాకుండా ఎన్యూమరేషన్ ఫారాలను ఎలా నింపాలో ఇంటి యజమానికి అర్థం అయ్యేలా వివరించాలన్నారు నింపిన ఫారాలను రెండు, మూడు రోజుల్లో తిరిగి బీ ఎల్ వో లకు అందజేయాలని తెలిపారు. రెండు రోజుల్లో గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని బీ ఎల్ వో లను ఆమె ఆదేశించారు. ఫారాలు ఇచ్చేటప్పుడే ఓటర్ల అనుమానాలను బీఎల్ వోలు నివృత్తి చేయాలన్నారు. ఎలాంటి అపోహలకు తావు లేకుండా ఓటర్లు ఎన్యూమరేషన్ ఫారాలలో అన్ని వివరాలు రాసి తిరిగి ఇచ్చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తాసిల్దార్ లక్ష్మణ్ బాబు రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా ఉన్న జర్నలిస్ట్ లకు సుప్రీం కోర్ట్ గుడ్ న్యూస్...



ప్రజాస్ఫూర్తి, ఖమ్మంజిల్లా : పెన్ను పట్టిన,వీడియో కెమెరా పట్టి తమ విధులు రోజు వారి వార్త, న్యూస్ ప్రసారాలు నిర్వహిస్తున్నా వారందరు జర్నలిస్ట్ లిస్టులే.!!సుప్రీం కోర్ట్ ఇకపై కావాలనే కక్ష్య తో రాజకీయ నాయకులు,అక్రమ సంపాదన దందాలు చేసే వారు,వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి అక్రమాలకు పాల్పడే వాళ్ళ బాగోతలపై నిజాలను నిర్భయంగా వార్త రాసిన, న్యూస్ ప్రసారాలు చేసిన జర్నలిస్ట్ లపై అక్రమ కేసులు చెల్లనేరావు:సుప్రీం కోర్ట్ శాటిలైట్ ఛానెల్స్,యూట్యూబ్ న్యూస్ ఛానెల్స్,ప్రింట్ మీడియా సంస్థల్లో పని చేసే జర్నలిస్ట్ లు ఆయా సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారు అక్రమ కేసుల లేక నిజ నిరూపణ కేసుల అనేది ఆయా సంఘాల ద్వారా పరిష్కారం కొరకు 7రోజుల్లో నిర్ణయం తీసుకున్నే హక్కులు జర్నలిస్ట్ సంఘాలకే ఉంటుందని,వాళ్ళను కాదని అక్రమ కేసులు పెట్టిన వాళ్ళపై,అట్టి పోలీస్ లపై వేట తప్పదు:సుప్రీం కోర్ట్.

# మత్తుపై మిషన్ పరివర్తన.. యువతకు ఎమ్మెల్యే గండ్ర కీలక సందేశం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా , ప్రజాస్ఫూర్తి : మత్తు పదార్థాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. జిల్లా దివ్యాంగులు, వృద్ధులు, ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల సాధికారత శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ పరివర్తన' అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి, ఎక్సైజ్ అధికారులు, మున్సిపల్ ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: వట్టికొండ రజిని జయంతి సందర్భంగా గౌతంపూర్‌లో ఆమె కుటుంబ సభ్యులు పేదలకు సోమవారం నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏఐటియుసి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్ మాట్లాడుతూ వట్టికొండ రజిని ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ ఉపసర్పంచ్ తోటరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# పల్స్ పోలియోను పరిశీలించిన రాష్ట్ర బృందం



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:పట్టణంలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలన అధికారి బ్రహ్మానందరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సఫాయిబస్తీ, బొల్లొరిగూడెం, పాల్వంచ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి, జిల్లా శిశు ఆరోగ్య, రోగనిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రతాప్, సీహెచ్‌వో నాగభూషణం, సీహెచ్‌వో సోమ్లా నాయక్, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దివ్యాంగుల పునరావాస కేంద్రానికి ఆటో బహుకరణ



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలోని యాదగిరిగుట్ట మండలంలో ఉన్న దివ్యాంగుల పునరావాస కేంద్రానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సహకారంతో, సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూలర్ పువరైటీ సౌజన్యంతో ప్రత్యేకంగా అందించిన ఆటో వాహనాన్ని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులకు మెరుగైన సేవలు అందించడంలో ఈ ఆటో వాహనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, వారి రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి అదనపు డీఆర్‌డీఓ డిపి ఎం యు ఎస్ ఏపిఎం జిల్లా సమాఖ్య ఓబీ సభ్యులు, ఏపీఎంలు, ఎన్ ఎస్ సి సి కార్యకలాపాల సిబ్బంది, ఆయాలు, దివ్యాంగుల పిల్లలు, వారి తల్లిదండ్రులు , ఇతర అధికారులు పాల్గొన్నారు

# సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

*** జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : సాగు నీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో కలిసి ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 65,ఇతర శాఖలకు 41, మొత్తం 106 ఫిర్యాదులు వచ్చాయి.ఫిర్యాదుల స్వీకరణ అనంతరం ఎప్పటిలాగే వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.పాఠశాలలు, కళాశాలలు ,హాస్టళ్లలో ప్రవేశాల కోసం వచ్చిన దరఖాస్తులను ఆయా సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు పరిశీలించి వాటికి ప్రాధాన్యత ఇచ్చి సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేయాలని చెప్పారు.డిండి,దున్నపోతుల గండి తదితర ప్రాజెక్టుల భూ సేకరణ మొదలుకొని అన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన భూ సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేసి పూర్తి చేసేలా ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు..మండల ప్రత్యేక అధికారులు, తహసిల్దారులు, ఎంపీడీవోలు అన్ని సంక్షేమ వసతి గృహాలను తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని, వచ్చేనెల మొదటి వారంలో ఫుడ్ సేఫ్టీ సమావేశాలునిర్వహించాలని, జిల్లా అధికారులందరూ మంగళవారం లోగా టూర్ డైరీలు సమర్పించాలని ఆదేశించారు.శాఖలకు సంబంధించి నివేదికలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ సిద్ధంగా ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు. మిర్యాలగూడలో పైలెట్ పద్ధతిన చేపట్టిన నక్ష సర్వే పనులు వేగవంతం చేయాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లు ,తదితర అంశాలపై సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ,డిఆర్ఓ దశరథ్, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి, జెడ్పి సి ఈ ఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనింగ్) శ్రీకాంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హ్యాం రోడ్లతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయి

*** రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి.**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: హ్యాం రోడ్డుతో రాష్ట్ర రూపురేఖలు మారుతాయని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.సోమవారం నల్లగొండలోని ప్రకాశం బజార్ లో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రఘువీర్ రెడ్డికి విషెస్ తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ రోడ్లు అభివృద్ధి చెందితే పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలు కూడా అభివృద్ధి చెందుతాయని, పరిశ్రమలు ఏర్పడడానికి అవకాశం ఉంటుందన్నారు.దీంతో స్థానిక యువత, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యే హం ప్రాజెక్టుకు నల్గొండ జిల్లాలోని కనగల్ మండల కేంద్రంలో పైలాన్ ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. ఈ రెండు రోజులలో మరోసారి ఢిల్లీకి వెళ్లి రోడ్ల కోసం మరో రూ.1000 కోట్లను మంజూరు చేయించుకోవడం జరుగుతుందని వెల్లడించారు. విజయవాడ హైదరాబాద్ ఫోర్ లైన్ కోసం టెండర్లు పిలిచామని పేర్కొన్నారు. గుర్రంపోడ్ దాటిన తర్వాత 3 కిలోమీటర్ల పక్క నుంచి గ్రీన్ ఫీల్డ్ సిటీ హైవే బందర్ వయా అమరావతి వరకు డిపిఆర్ పూర్తయి టెండర్ స్టేజ్ లో ఉందన్నారు.మన్ననూరు శ్రీశైలం 52 కిలోమీటర్ల ఎలివేటర్ కారిడార్ ఫ్లైఓవర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. మూడు నెలల్లో డిపిఆర్ ఫైనల్ అయితే క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత పనులు ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యుడు కుందూరు రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, నల్గొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ,కనగల్, తిప్పర్తి మాజీ జడ్పిటిసిలు వంగూరి లక్ష్మయ్య, నర్సింగ్ శ్రీనివాస్ గౌడ్, పాశం రామ్ రెడ్డి, డిసిసిబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, నల్లగొండ పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు, జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు పాదం అనిల్ కుమార్, పలువురు కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పశువుల దొంగతనాల ముఠా అరెస్ట్

*** 7 గేదెలు, గూడ్స్ వాహనం, రూ.50 వేల నగదు స్వాధీనం.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో వరుసగా పశువుల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను అరెస్టు చేసిన పోలీసులు. నిందితుల నుంచి 7 గేదెలు, రెండు మొబైల్ ఫోన్లు, ఒక అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తాడేపల్లి మండలానికి చెందిన వీర్ల వెంకట్రావు (35),చిత్తూరి గంగాధర్ (33)తో పాటు మరో ఇద్దరు కలిసి గత కొంతకాలంగా పశువుల దొంగతనాలకు పాల్పడుతున్నారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ లో పశువులను దొంగిలించి విక్రయిస్తూ వచ్చారు. అనంతరం జిల్లాను లక్ష్యంగా చేసుకుని హైవే పక్కన కట్టివేసిన గేదెలు, దూడలను దొంగిలించి కామారెడ్డి జిల్లా తుల్జాపూర్ గ్రామానికి తరలించేవారు. మే నెలలో రెండు విడతల్లో జిల్లా కేంద్రం పరిసర ప్రాంతాల నుంచి గేదెలు, దూడలను దొంగిలించిన నిందితులు, వాటిలో కొన్ని వినుకొండ పశువుల సంతలో విక్రయించి వచ్చిన డబ్బును పరస్పరం పంచుకున్నట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం జూన్ రెండో వారంలో మరోసారి జనగామ-సిద్దిపేట రహదారి సమీపంలో వ్యవసాయ పొలాల నుంచి గేదెలను అపహరించారు. 29 న దొంగిలించిన గేదెలను గుంటూరు వైపు తరలిస్తుండగా, వడ్లకొండ క్రాస్ రోడ్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు అనుమానంతో గూడ్స్ వాహనాన్ని ఆపి పశువుల రవాణాకు సంబంధించిన పత్రాలు కోరారు. సరైన ఆధారాలు చూపలేకపోవడంతో విచారించగా నిందితులు దొంగతనాలను ఒప్పుకున్నారు.నిందితుల నుంచి 7 గేదెలు, రెండు మొబైల్ ఫోన్లు, అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం, రూ. 50 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ కేసును వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ సూచనల మేరకు, ఏసీపీ బీమా శర్మ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ రెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఎం.భరత్, కానిస్టేబుళ్లు బి.కర్ణాకర్,ఎన్.సాగర్,బి.కృష్ణ,కె.అనిల్, బి.భాస్కర్ ఛేదించారు.నిందితులను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు బృందాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించారు.

# అనారోగ్య బాధలు భరించలేక పురుగుల మందు తాగి వృద్ధురాలి ఆత్మహత్య



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల పరిధిలోని నామాపూర్ గ్రామంలో అనారోగ్య బాధలను తట్టుకోలేక ఒక వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన విషాద సంఘటన చోటుచేసుకుంది. ముస్తాబాద్ సబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం.. నామాపూర్ గ్రామానికి చెందిన జూకంటి సుధాకర్ రావు భార్య జూకంటి సులోచన (60) గత కొంతకాలంగా తీవ్రమైన మోకాళ్ల నొప్పులు, ఒంటి నొప్పులతో బాధపడుతోంది. ఈ క్రమంలో నొప్పుల బాధ విపరీతంగా ఉండటంతో, ఆ వేదనను భరించలేక, కుటుంబ సభ్యులకు ఎవరికీ భారంగా ఉండకూడదనే ఉద్దేశ్యంతో ఆమె చనిపోవాలని నిర్ణయించుకుంది. ఈనెల 27న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒక గుర్తుతెలియని పురుగుల మందు తాగింది. అదే సమయంలో భర్త సుధాకర్ రావు ఇంటికి వచ్చేసరికి పురుగుల మందు వాసన వస్తూ తన భార్య కింద పడి ఉండటాన్ని గమనించాడు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సిద్దిపేటలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి అడ్మిట్ చేశారు. అక్కడ అత్యవసర విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈనెల 28న రాత్రి సమయంలో సులోచన మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముస్తాబాద్ ఎస్సై జ్యోతి కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టంకు పంపి దర్యాప్తు జరుపుతున్నారు.

# అంబేద్కర్ చౌక్ ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మతు చేయాలి

*** ఎస్పీకి బీసీ నాయకుడు భీమనాథుని సత్యనారాయణ వినతి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద గత నెల రోజులుగా ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని బీసీ జిల్లా నాయకుడు భీమనాథుని సత్యనారాయణ ఆందోళన వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు అధికంగా రాకపోకలు సాగించే ఈ కూడలిలో ట్రాఫిక్ సిగ్నల్స్ వెంటనే మరమ్మతు చేయించి ప్రజల ప్రాణాలను కాపాడాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిష్కరించేందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# ప్రజల దీవెనతో సభ విజయవంతం

*** నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత.**



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : నల్గొండలో సీఎం రేవంత్ రెడ్డి సభ విజయవంతం అయ్యిందని దీనిని విజయవంతం చేసినా నల్గొండ జిల్లా ప్రజలకు నల్గొండ డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత కృతజ్ఞతలు తెలిపారు. అన్ని వర్గాల ఆదరణ కలిగిన కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని రుజువు అయిందని, దీనితో ప్రతిపక్షాలు దిక్కుతోచక అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఈ సభకు భారీగా హాజరైన నల్గొండ మహిళ సోదరీమణులకు ఆకాంక్ష మేరకు సీఎం రేవంత్ రెడ్డి వారి పక్షపాతిగా నిలబడ్డారన్నారు. పది సంవత్సరాలుగా కేసీఆర్ పాలనలో నల్గొండ జిల్లాకు చేకూరిన ప్రయోజనం శూన్యమని నేటి రెండున్నర సంవత్సరాలుగా పాలనలో వేల కోట్లు కేటాయించిన ఘనత ముఖ్యమంత్రిదిన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ సెల్ చైర్మన్ జిల్లపల్లి పరమేష్,ఎండి ముంతాజ్ అలీ, మేకల రాజేందర్ రెడ్డి,దామనూరి అశోక్, చర్లపల్లి గౌతం, పగిళ్ల రాజు, వేముల గోపీనాథ్, వెంకటరత్నం, గుర్రం కోటేష్, ఎండి అజీస్, సయ్యద్ నాగుల్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎస్పీ



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పాల్వంచ సమీపంలోని నవభారత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని, ఎస్పీ క్యాంప్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సోమవారం సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఇంజనీర్లతో మాట్లాడిన ఎస్పీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్- 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్, ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

# మహిళా సమైక్య సంఘం నూతన భవన నిర్మాణ శంకుస్థాపన



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట:సూర్యాపేట మండలంలోని టేకుమట్ల గ్రామంలో మహిళా సమైక్య సంఘం నూతన భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గట్టు జ్యోతి శ్రీనివాస్ ఆహ్వానం మేరకు ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని, మహిళా సమైక్య సంఘాల బలోపేతం ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మహిళలకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సౌకర్యవంతమైన భవనం అందుబాటులోకి రానుందని తెలిపారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ సేవలు అభినందనీయం

- తీగల మోహన్ రావు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సమాజ సేవలో ముందుండి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవ సేవ లు అభినందనీయమని లయన్స్ క్లబ్ నల్లగొండ జిల్లా మాజీ గవర్నర్ తీగల మోహన్ రావు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డులోని లయన్స్ భవన్ లో లయన్స్ క్లబ్ ఆప్ చౌటుప్పల్ సేవ 11వ ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తీగల మోహన్ రావు హాజరై మాట్లాడారు. లయన్స్ క్లబ్ ముఖ్యంగా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, పేద విద్యార్థులకు సహాయం వంటి రంగాలలో చేస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాయని కొనియాడారు. లయన్స్ క్లబ్ ప్రపంచవ్యాప్తంగా 210దేశాల్లో విస్తరించి 15లక్షల సభ్యులతోటి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం వందల కోట్ల రూపాయల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ ఏర్పడి 10సంవత్సరాలు పూర్తి చేసుకుని చౌటుప్పల్ లో ఉచిత కంటి ఆసుపత్రి నిర్మించి, పది సంవత్సరాలుగా వేల మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలోనే మంచి గుర్తింపు పొందడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు ఎండి ఆతార్ పాషా, కార్యదర్శి దాచేపల్లి రాజు, కోశాధికారి బత్తిని రఘులను లయన్స్ క్లబ్ ఫస్ట్ వాయిస్ డిస్టిక్ గవర్నర్ కోడె సతీష్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ క్లబ్బులో సభ్యులుగా ఉండడం ఎంతో అదృష్టమని మొగుదాల పావని అన్నారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, సేవా భావంతో పనిచేస్తున్న ప్రతి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్త, పోలోజు శ్రీనివాస చారి, గోశిక కరుణాకర్, మొగుదాల రమేష్, బాచుపల్లి రవీందర్, తిరందాస్ జగన్నాథ్, సిలివేరా మంగయ్య, ఉప్పు ఆంజనేయులు, నాంపల్లి రమేష్, కొనసం రాంరెడ్డి, కాసుల వెంకటేశం, కటకం ప్రశాంత్, కామిశెట్టి చంద్రశేఖర్, తిరుమలరెడ్డి, గోపగొని లక్ష్మణ్, దాచేపల్లి శ్రీను, భాస్కర్ రెడ్డి, ఫణీందర్, పోలోజు రాజు, శ్రీనివాస చారి, వనం రాజు, వేముల నరసింహ, సత్యనారాయణ చారి, కాంశెట్టి భాస్కర్, అనిల్, ప్రతాపరెడ్డి, సంపూర్ణ చారి పాల్గొన్నారు.

# పేద గర్భిణి వైద్యానికి రూ.5,000 ఆర్థిక సాయం

* నిరుపేద కుటుంబానికి అండగా నిలవాలని దాతలకు పిలుపు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన సాకలి సంగీత కుటుంబానికి ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏళ్ళ బాల్ రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. మండల కేంద్రానికి చెందిన సాకలి సంగీత నిండు గర్భిణి కాగా, ఇటీవల ఆమె ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోగా కడుపులోని పాప చనిపోయిందని, శరీరం మొత్తం ఇన్ఫెక్షన్ అయిందని వైద్యులు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట, హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లగా, తల్లి పరిస్థితి విషమంగా ఉందని, సర్జరీ కోసం ముందుగా రూ.5 లక్షలు డిపాజిట్ చేయాలని వైద్యులు సూచించారు.అంత పెద్ద మొత్తంలో డబ్బులు లేకపోవడంతో నిరుపేద కుటుంబం దాతల సహాయం కోసం వేడుకుంది. చిన్నారులు తమ అమ్మ ప్రాణాలు కాపాడాలని రోదించడంతో మానవతా దృక్పథంతో స్పందించిన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ళ బాల్ రెడ్డి బాధిత కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు ఎవరైనా ముందుకు వచ్చి ఈ నిరుపేద కుటుంబానికి తోచినంత ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు సహకరించాలి

* జిల్లా విద్యాధికారి భిక్షపతి



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రజా ప్రతినిధులు సహకరించాలని జిల్లా విద్యాశాఖాధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. గతంలో మూతపడిన భువనగిరి మండలం లోని బాలంపల్లి ప్రాథమిక పాఠశాలను తిరిగి ప్రారంభించి మాట్లాడుతూ సుశిక్షితులైన ఉపాధ్యాయులు ఉండే ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నందువలన అందరు తమ పిల్లలను పంపించాలని ఆయన కోరారు. ప్రారంభించిన పాఠశాలకు పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం మొదలైన అన్ని సదుపాయాలను, ఉపాధ్యాయులను వెంటనే సర్దుబాటు చేయాలని మండల విద్యాధికారిని ఆదేశించారు. పాఠశాల తిరిగి ప్రారంభం కావడానికి పూనుకున్న గ్రామ సర్పంచ్ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నదనీ, ప్రైవేటు పాఠశాలలకు పంపించే తల్లిదండ్రులు అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి, ఉపసర్పంచ్ కృష్ణ, మండల విద్యాధికారి ఆర్. రంగరాజన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎన్.అండాలు, ఉప సర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు, సి.ఆర్పీ.అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా స్కూల్ నియోజకవర్గానికి కీర్తి పతాక

– ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఏర్పాటు కానున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కొత్తగూడెం నియోజకవర్గానికి ఒక కీర్తి పతాక అని, ఈ స్కూల్ ఏర్పాటుతో కొత్తగూడెం జిల్లా కేంద్రం గొప్ప విద్యా హబ్‌గా మారబోతోందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణ పనులను సోమవారం ఆయన అధికారులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కులమతాలకతీతంగా అన్ని వర్గాల విద్యార్థులకూ ఒకే క్యాంపస్‌లో విద్యను అందించాలనే ప్రభుత్వ ఆలోచన ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ ప్రాజెక్టు కింద కొత్తగూడెం క్యాంపస్‌లో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో అత్యంత అత్యాధునిక హంగులతో ఈ స్కూల్ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. 25.475 ఎకరాల భారీ విస్తీర్ణంలో, 5,38,246 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో నిర్మిస్తున్న ఈ భారీ నిర్మాణాల్లో అకడమిక్ బ్లాక్, జూనియర్, సీనియర్ హాస్టల్ బ్లాకులు, డైనింగ్, కిచెన్ లతో పాటు సిబ్బంది కోసం క్వార్టర్లను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, కమిషనర్ సుజాత, డీఈవో వాసంతి, పాఠశాలల భవనాల పర్యవేక్షణ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

* సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి: కూనంనేని

సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిల భారత బొగ్గుగనుల అధికారుల సంఘం (ఐఎంఓఏ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం అధికారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జె గట్టయ్య, కిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అభివృద్ధికి విద్యా సంస్థల మంజూరు కై వినతి



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా అభివృద్ధి కి విద్యా సంస్థల మంజూరు కై జిల్లా ప్రత్యేక అధికారికి వినతి పత్రం అందజేశారు. సోమవారం జిల్లా ప్రత్యేక అధికారి,సాంకేతిక కమిషనర్ దేవసేన ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి వినతి పత్రాన్ని నాగరత్న సేవా సంఘం వ్యవ స్థాపక అధ్యక్షులు సబ్బం పరమేష్ ఆధ్వర్యంలో అందజేశారు. అయన మాట్లాడుతూ నియోజకవర్గానికి కాకతీయ ఇంజనీరింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ మంజూరు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలో ఇప్పటికే ప్రభుత్వానికి చెందిన సుమారు 15 ఎకరాల స్థలం, సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని వినియోగించి ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా వెనుకబడిన ప్రాంతమని, నిరుపేద విద్యార్థులు ఉన్నత విద్య కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది అని తెలిపారు. జిల్లాలో అవసరమైన మౌలిక సదుపాయాలు ఉన్నందున విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తే జిల్లా విద్య, సామాజిక, ఆర్థిక అభివృద్ధి లో ముందడుగు వేస్తుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిణి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో తన వంతు సహాయ సహకారం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జున్,జిల్లా ఉన్నతాధికారులు, నాగరత్న సేవా సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ తొ కలిసి దరఖాస్తులను స్వీకరించారు.ఈ సందర్భంగా గూడూరు మండలం, వెంగంపేట గ్రామానికి చెందిన కట్ల పార్వతి తాను ఉన్న ఇల్లు శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చివేసి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో రేకుల షెడ్ లో కిరాయికి ఉంటున్నామని అది ఈ మధ్య కురిసే వర్షాలకు శిథిలావస్థకు చేరుకోవడం జరిగిందని దయచేసి తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని కోరారు. మరిపెడ మండలం వీరారం తండ కు చెందిన డి.రమేష తనకున్న పట్టా భూమిలోని కొంత భూమి గుర్తు తెలియని వ్యక్తి అక్రమంగా పట్టా చేయించుకున్నారని అట్టి పట్టాను రద్దు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. పెద్దవంగర మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన సుధగాని యాధలక్ష్మి 202324 సం.లో గ్రామాభివృద్ధి కోసం ఖర్చు చేసి యం.బి రికార్డు అయిన బిల్లులను ఇప్పించగలరని కోరారు.నిర్వహించిన ప్రజావాణి లో వివిధ శాఖలకు సంబంధించి (205) దరఖాస్తులను సంబందిత శాఖల అధికారులకు సత్వర పరిష్కారానికి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ నాగలక్ష్మి, డిప్యుటీ కలెక్టర్ జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారి

# 31వ ఆత్మసాక్షాత్కార మహోత్సవం



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : నాగిరెడ్డిపల్లి గ్రామంలోని రమణేశ్వరంలో జగద్గురు సిద్ధగురు శ్రీ రమణానంద మహర్షి వారి 31వ ఆత్మసాక్షాత్కార మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ మహోత్సవంలో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు.ఈ సందర్భంగా సిద్ధగురు ధ్యానాన్ని నిర్వహించగా, భక్తులు అత్యంత ఏకాగ్రతతో ధ్యానంలో పాల్గొన్నారు. అనంతరం శ్రీచక్ర మహాలయంలో ప్రత్యేక అభిషేకాలు, బంగారు శివలింగానికి మహాభిషేకం నిర్వహించారు. కార్యక్రమం అనంతరం భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సిద్ధగురు ప్రసంగిస్తూ ఆత్మదర్శనం యొక్క గొప్పతనాన్ని వివరించారు. 1995 జూన్ 29న మాత పూర్ణానంద యోగిని వారి అనుగ్రహంతో, వారి శక్తిపాతం ద్వారా తనకు ఆత్మదర్శనం కలిగిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు ఆ దివ్య అనుభూతిని పొందినట్లు పేర్కొన్నారు. ఆత్మదర్శనం అంటే మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం, జీవభావం వంటి అన్ని పరిమితులను అధిగమించి, ఎలాంటి సంకల్పాలు, వికల్పాలు, భావాలు లేని దివ్య ప్రజ్ఞా స్థితిలో నిలవడమేనని సిద్ధగురు వివరించారు. అలాంటి దివ్య స్థితిని కోట్లలో ఒక్కరు మాత్రమే పొందగలరని చెప్పారు. కేవలం శాస్త్రాలు, వేదాలు అధ్యయనం చేయడం వల్ల భాషాజ్ఞానం, బుద్ధిజ్ఞానం మాత్రమే లభిస్తాయని, కానీ ఆత్మదర్శనం లభించదని స్పష్టం చేశారు. సద్గురువును ఆశ్రయించి, గురుసేవ చేస్తూ, గురుకృపను పొందినప్పుడే ఆత్మసాక్షాత్కారం సాధ్యమవుతుందని తెలిపారు.ఈ మహోత్సవంలో పండిత్ గోపదేవ వారి ప్రముఖ శిష్యుడు మసన చెన్నప్ప వారు అనేక మంది ప్రముఖులు, భక్తులు ఈ కార్యక్రమానికి హాజరై మహోత్సవాన్ని విజయవంతం చేశారు.ఆధ్యాత్మికత, గురుభక్తి, ధ్యానసాధన, వైదిక సంప్రదాయాల సమన్వయంగా నిర్వహించబడిన ఈ 31వ ఆత్మసాక్షాత్కార మహోత్సవం భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది. పాల్గొన్న భక్తులందరూ సిద్ధగురు ఆశీస్సులు పొంది ఆధ్యాత్మిక ఉత్సాహంతో తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారు.

# ప్రజావాణి అర్జీలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి

* జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



జనగామ, ప్రజాస్ఫూర్తి : ప్రజావాణిలో ప్రజలు సమర్పించే దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకో వాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.సోమ వారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్ షా లోం తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాఖల వారీగా దరఖాస్తులను పరిశీలించి నిర్ణీ త గడువులోగా పరిష్కరించాలని, పెం డింగ్ లో ఉన్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వారపు ప్రజావాణిలో మొత్తం 401దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణిలో ప్రధానంగా భూ వారసత్వ హక్కులు,భూముల రికార్డుల నమోదు , ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు తదితర సమస్యలకు సంబంధించిన వినతులు అధికంగా వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రంగారావు , డీఆర్డీఓ భాస్కర్, గృహ నిర్మాణ శాఖ పీ.డీ మాత్రు నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్‌తో లక్షల లీటర్ల తాగునీరు వృథా



నర్సాపూర్, ప్రజాస్ఫూర్తి : నర్సాపూర్ నియోజకవర్గంలోని హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో దౌల్తాబాద్-సంగారెడ్డి జాతీయ రహదారి పక్కన ఉన్న బ్రిడ్జి కింద మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోవడంతో తాగునీరు భారీగా వృథా అవుతోంది. పైప్‌లైన్ నుంచి నిరంతరం ఉధృతంగా నీరు ప్రవహిస్తూ చెరువు ప్రాంతంలోకి చేరుతోంది. స్థానికుల కథనం ప్రకారం, పైప్‌లైన్ లీకేజీ జరిగినప్పటి నుంచి లక్షల లీటర్ల తాగునీరు వృథాగా పోతున్నా సంబంధిత మిషన్ భగీరథ అధికారులు ఇప్పటివరకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒకవైపు గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు ప్రభుత్వ నిధులతో సరఫరా చేస్తున్న విలువైన తాగునీరు ఇలా వృథా కావడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. జాతీయ రహదారి పక్కనే ఈ లీకేజీ స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.గ్రామస్థులు వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి తాగునీటి వృథాను అరికట్టాలని, నిర్లక్ష్యానికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# లింగాల ఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన వెస్ట్ జోన్ డీసీపీ




జనగామ, ప్రజాస్ఫూర్తి : వెస్ట్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రాజమహేందర్ నాయక్ సోమవారం లింగాలఘనపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. భౌతిక రిజిస్టర్లతో పాటు సీసీటీఎన్ఎస్ లో నమోదైన వివరాలను సరిపోల్చి నవీకరణ స్థితిని పరిశీలించారు.కేసుల సత్వర పరిష్కారం, సీసీటీఎన్ఎస్‌లో పూర్తి స్థాయి నమోదు, సమర్థవంతమైన పహారా నిర్వహణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై సిబ్బందికి డీసీపీ పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, విధుల నిర్వహణలో నాణ్యత పెంచుతూ ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా సేవలు అందించాలని ఆదేశించారు.



# డిజిటల్ యుగంలో విచక్షణ
# సమాచార ప్రవాహం – పౌరుడి బాధ్యత

**"నిజం బూట్లు వేసుకునే లోపే, అబద్ధం ప్రపంచమంతా చుట్టి వస్తుంది" అన్న నానుడి నేటి డిజిటల్ యుగంలో అక్షర సత్యమైంది. అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్ ద్వారా సమాచారం క్షణాల్లో మన గడప తాడుతోంది. కానీ, ఈ సమాచార ప్రవాహంలో సత్యం ఏది? అసత్యం ఏది? అని విశ్లేషించుకునే తీరిక మనకు ఉందా? ఒక చిన్న 'ఫార్వర్డ్' బటన్ ద్వారా మనం చేస్తున్న పని, సమాజంపై ఎంతటి ప్రభావాన్ని చూపుతుందో ఎప్పుడైనా ఆలోచించామా? సాంకేతికత వికసించిన ఈ కాలంలో, జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన మనం, అవాస్తవాల మాయాజాలంలో చిక్కుకుపోతున్నామా? ఈ సంక్లిష్టమైన డిజిటల్ కాలపు సవాళ్లను, బాధ్యతాయుతమైన పౌరుడిగా మన కర్తవ్యాన్ని చర్చించేదే ఈ ప్రత్యేక ఎడిటోరియల్.**






నేటి సమాజంలో సాంకేతికత మనిషి జీవితంలో ఒక అంతర్భాగమైపోయింది. ఉదయం నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ప్రతి నిమిషం మనం డిజిటల్ ప్రపంచంతో అనుసంధానమై ఉంటున్నాం. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు సమాచారాన్ని అరచేతిలోకి చేరవేస్తున్నాయి. అయితే, ఈ సమాచార విస్ఫోటనం ఒకవైపు విజ్ఞానాన్ని అందిస్తుంటే, మరోవైపు అవాస్తవాలు, తప్పుడు ప్రచారాలు (Fake News) కూడా అదే వేగంతో విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా మనం ఎలా వ్యవహరించాలి? అనేది నేడు అతిపెద్ద ప్రశ్న.




*** సమాచారం - విజ్ఞానం మధ్య వ్యత్యాసం**

సమాచారం అంటే కేవలం డేటా మాత్రమే. అది నిజం కావచ్చు లేదా అబద్ధం కావచ్చు. కానీ విజ్ఞానం అంటే ఆ సమాచారాన్ని విశ్లేషించి, అందులోని సత్యాసత్యాలను గ్రహించే సామర్థ్యం. సోషల్ మీడియాలో వచ్చే ఒక వీడియోను గానీ, మెసేజ్‌ను గానీ చూడగానే దాన్ని నిజమని నమ్మేయడం నేటి సమాజంలో అతిపెద్ద బలహీనతగా మారింది. భావోద్వేగాలను రెచ్చగొట్టే వార్తలు క్షణాల్లో వైరల్ అవుతున్నాయి. ఇలాంటి సమయంలో మనకు కావలసింది 'క్రిటికల్ థింకింగ్' (విమర్శనాత్మక ఆలోచన).

**తప్పుడు ప్రచారాల పర్యవసానాలు**

తప్పుడు వార్తల వల్ల కలిగే నష్టాలు ఊహాతీతం. వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతినడమే కాకుండా, కొన్నిసార్లు సమాజంలో మతపరమైన, ప్రాంతీయపరమైన ఘర్షణలకు దారితీస్తున్నాయి. ఆర్థిక పరమైన మోసాలు, సైబర్ నేరాలు కూడా సోషల్ మీడియా వేదికగానే మొదలవుతున్నాయి. ఒక అవాస్తవ వార్తను షేర్ చేయడం ద్వారా తెలియకుండానే మనం అశాంతికి కారణమవుతున్నామనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

**మనం చేయవలసినవి ఏమిటి?**

1. ధృవీకరించుకోవడం (Fact Check): ఏదైనా వార్త వాట్సాప్ గ్రూపుల్లో వచ్చినంత మాత్రాన అది నిజం కాదు. దానిని నమ్మకముందే విశ్వసనీయమైన వార్తా సంస్థల ద్వారా లేదా అధికారిక వెబ్‌సైట్ల ద్వారా నిజనిర్ధారణ చేసుకోవాలి.
2. ప్రేరేపితం కావద్దు: తరచుగా కొన్ని వార్తలు మనుషుల కోపాన్ని, ఆందోళనను రెచ్చగొట్టేలా ఉంటాయి. అటువంటి వార్తలను చూసినప్పుడు వెంటనే స్పందించకుండా, కొంత సమయం వేచి చూసి ఆలోచించాలి.
3. బాధ్యతాయుతమైన షేరింగ్: 'ఫార్వర్డ్' బటన్ నొక్కే ముందు, "నేను షేర్ చేస్తున్న ఈ సమాచారం వల్ల ఎవరికైనా హాని కలుగుతుందా?" అని ఒక్క క్షణం ఆలోచించండి. లేనిపక్షంలో ఆ సమాచారాన్ని అక్కడితోనే ఆపివేయడం ఉత్తమం.
4. సైబర్ అక్షరాస్యత: టెక్నాలజీ పెరుగు తున్న కొద్దీ దానిపై అవగాహన పెంచు కోవడం అవసరం. మన వ్యక్తిగత వివరాలను, పాస్‌వర్డ్‌లను ఎవరితోనూ పంచుకోకూడదు.

**ముగింపు**

సాంకేతికత అనేది ఒక కత్తి వంటిది. దానిని అజ్ఞానంతో వాడితే మనకే హాని కలుగుతుంది, అదే విచక్షణతో వాడితే సమాజ ప్రగతికి తోడ్పడుతుంది. డిజిటల్ యుగంలో 'జ్ఞానమే శక్తి' మాత్రమే కాదు, 'సత్యమే ఆయుధం'. అవాస్తవాలను తుడిచిపెట్టి, నిజాలను వ్యాప్తి చేయడం ద్వారా ఒక ఆరోగ్యకరమైన, సురక్షితమైన సమాజాన్ని నిర్మించుకుందాం. సమాచార ప్రవాహంలో కొట్టుకుపోకుండా, విచక్షణ అనే చుక్కానితో ముందుకు సాగుదాం.










## ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

భువనగిరి, ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలిసి, వివిధ ప్రాంతాల ప్రజల నుండి వచ్చిన 69అర్జీలను స్వీకరించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 31, జిల్లా గ్రామీణాభివృద్ది 7, సర్వే ల్యాండ్ 6, మున్సిపాలిటీ 6, వ్యవసాయ 4, సంక్షేమ శాఖ 3, ,ఆర్టీసీ 2, జిల్లా పరిషత్ 2, చేనేత , కోపరేటివ్, సమాచార శాఖ, విద్య, బి.సి వెల్ఫర్, హౌసింగ్, వైద్య ఆరోగ్య, పంచాయతీ,శాఖలకు ఒక్కటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిఈఓ జెడ్పి జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డి. ఆర్.ఓ జయమ్మ, పిడి హౌసింగ్ అలివేలు, ఆర్డీవో కృష్ణారెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## మాదారబోయిన ఐలయ్య ఈ మొక్కలో జీవించి ఉంటాడు

మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రజా హృదయం స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు హరిత మిత్ర అవార్డు గ్రహీత. దైద వెంకన్న ఆధ్వర్యంలో యాదవ నగర్ కాలనిలో సంవత్సరికం సందర్భంగా ఐలయ్య జ్ఞాపకార్థంగా వారికి హిమయిత్ మామిడి మొక్కను ఇచ్చారు. వెంకన్న మాట్లాడుతూ రోజుకు పెరిగి పోతున్నా కాలుష్యన్ని నివారించాలంటే విరివిరి మొక్కలు నాటలని అన్నారు. మీరు కూడా మీ పుట్టిన రోజు,పెళ్లి రోజు ,అమ్మ నాన్నల జ్ఞాపకర్థంల సందర్భంగా మొక్కలు నాటి వాటిని వృక్షాలు అయేంత వరకు సంరక్షించాలని తెలుపుతూ పర్యావరణపై నిరంతరం ప్రజల్లో పూర్తి అవగాహనా ఉన్న ఎందుకో పర్యావరణ పై శ్రద్ధ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎందుకంటే ఈ సంవత్సరం వర్షాలు జూన్ నెల పూర్తి కావస్తున్న ఇప్పటి వరకు తగిన వర్షాలు పడలేదని దీనికి కారణం చెట్లను నరకడం వల్లే నాని అన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రాబోయే రోజులల్లో వర్షాలు పడక పంటలు పండక. భూమి వేడి ఎక్కి గాలి లేక ఆక్సిజన్ అందాకా మనుషులు పిట్టల్ల రాలి పోతారని తెలిపారు అందుకే ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటి ఇది వృక్షం ఆయెంత వరకు రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు భార్య,కొడుకులు, కొడళ్లు.తదితరులు పాల్గొన్నారు.

## అక్రిడిటేషన్ కార్డుల జారీలో అక్రమాలపై విచారణ జరపాలి



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, ఈవిషయమై సమగ్ర విచారణ జరిపి, అర్హులైన నిజమైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని పాల్వంచ మాజీ జడ్పీటీసీ దుర్గ కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియలో పారదర్శకత లోపించిందన్నారు. డిపిఆర్ఓ పర్యవేక్షణ లేమితో కొందరు రాజకీయ నాయకులు, ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్న వారికి కూడా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు ఆరోపించారు. విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లు తేలితే అనర్హులకు జారీ చేసిన కార్డులను రద్దు చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ముస్తాబాద్ లోని తాజ్ లాల్ వైన్స్ పై చర్యలు తీసుకోవాలి




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండల కేంద్రంలోని తాజ్ లాల్ వైన్స్ యాజమాన్యం ఎక్సైజ్ నిబంధనలను ఇష్టారాజ్యంగా ఉల్లంఘిస్తోందని పల్లె ప్రజలు మండిపడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రతిరోజు ఆటోల ద్వారా నేరుగా గ్రామాల్లోని బెల్టు షాపులకు అధిక మొత్తంలో మద్యాన్ని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అనుమతులు లేని బెల్టు షాపులను వైన్స్ యజమానులు ప్రోత్సహిస్తూ, నిర్ణీత ధరల కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం తూతూ మంత్రంగా తనిఖీలు చేస్తూ వదిలేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే ఊరూరా విచ్చలవిడిగా బెల్టు షాపులు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న తాజ్ లాల్ వైన్స్ పై, గ్రామాల్లోని బెల్టు షాపులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు



## ఎస్ఐఆర్ పై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలి

*** ఓటరు సవరణ ప్రక్రియను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్ మండలం పోతారం ఎస్ గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటరు సవరణ ప్రక్రియను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్వోలు బిఎల్ఎ లతో మాట్లాడి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. అర్హుడైన ప్రతి పౌరుడు ఓటరుకు నమోదు కావాలని అందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అలాగే ప్రజలు తమ ఓటర్ వివరాలను సరిచూసుకొని అవసరమైన పత్రాలతో ఫారాలను సకాలంలో సమర్పించాలని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఒక కలర్ పాస్ ఫోటో సైజ్ ఫోటోను ఎన్యుమరేషన్ ఫారం తో పాటు సంబంధిత అధికారులకు సమర్పించాలని మంత్రి కోరారు. ఓటరు సవరణ ప్రక్రియ 2002లో జరిగిందని మళ్లీ ఇప్పుడు జరుగుతుందని అర్హత ఉన్న ఒక ఓటు కూడా మిస్ కావద్దని ఆనాడు ప్రభుత్వం ఎన్నికల కమిషన్ ఉండేదని ఇప్పుడు బిజెపి వ్యతిరేక ఓట్లు తొలగించే ప్రయత్నం చేస్తుందని అన్నారు ఇప్పుడు అర్హత ఉన్న ఒక ఓటు కూడా తొలగిపోవద్దని గ్రామాలలో వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు ప్రతి ఇంటికి బిఎల్వోలు వచ్చి ఒక్కొక్కరికి ఒక ఎన్యూమరేషన్ ఫారం ఇస్తారని మీరు రెండు ఫోటోలు రెడీ పెట్టుకోండి అని మంత్రి సూచించారు.జులై 31 తారీకు వరకు డ్రాప్ ఓటరు జాబితా రిలీజ్ చేస్తారని మీకు ఏ ఇబ్బంది ఉన్న గ్రామ సర్పంచ్లకు తెలియపరచాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఒకే ఆయుధం.. ఒకే తీర్పు

యంగ్ టైగర్ ఎన్టీఆర్, డైరెక్టర్ త్రివిక్రమ్ కాంబో మరోసారి సెట్టయ్యింది. అరవింద సమేత తర్వాత మైథలాజికల్ తెరకెక్కుతోన్న సినిమాను సోమవారం అఫీషియల్‌గా అనౌన్స్ చేశారు. గాడ్ ఆఫ్ వార్‌గా పురాణాలు అభివర్ణించిన కుమారస్వామి కథతో ఈ సినిమా రూపొందనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఎన్టీఆర్ సైతం తన ట్విట్టర్‌లో అభిమానులతో పోస్టర్‌ను పంచుకున్నారు. ఇందులో శివుడి ఆయుధమైన త్రిశూలం కనిపిస్తోంది. ఒకే ఆయుధం.. ఒకే లక్ష్యం.. ఒకే తీర్పు అంటూ పోస్టర్‌పై ఉన్న క్యాప్షన్ ఆసక్తిని పంచుతోంది. ఈ సినిమాకు షణ్ముఖుడు అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. రాధాకృష్ణతో కలిసి నందమూరి కళ్యాణ్ రామ్ ఈ మూవీని నిర్మిస్తుండగా అనిరుధ్ మ్యూజిక్ అందిస్తున్నారు.

# బ్రేకప్ కన్ఫామేనా!

కాక్ టెయిల్ 2 సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తోన్న కృతిసనన్ తాజాగా బ్రేకప్ రూమర్లతో వార్తల్లో నిలిచింది. ప్రియుడు కబీర్ బాహియాతో తెగతెంపులు చేసుకున్నట్లు హిందీ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. కృతితో ప్రేమలో ఉండగానే మరికొందరు అమ్మాయిలతో కబీర్ సన్నిహిత సంబంధాలను కొనసాగించాడట. ఈ ఎఫైర్లు బయటపడటంతోనే ప్రియుడిని కృతి దూరం పెట్టినట్లు చెబుతోన్నారు. ఈ పుకార్లపై ఆమె సైలెంట్‌గా ఉండటంతో బ్రేకప్ కన్ఫామ్ అని ఫిక్సయ్యారు. కానీ ఈ రూమర్లలో నిజం లేదట. కబీర్‌తో ఉన్న ఆ అమ్మాయి అతడి ఫ్యామిలీ ఫ్రెండ్ అని అంటున్నారు. కృతికి కూడా ఆమె పరిచయమేనట. బ్రేకప్ వార్తలు అబద్ధమేనని కొట్టిపారేస్తున్నారు.





# కుర్చీ మడతపెట్టికి రికార్డ్ వ్యూస్

మహేష్‌బాబు, శ్రీలీల ఓ అరుదైన రికార్డును నెలకొల్పారు. వీరిద్దరు జంటగా నటించిన గుంటూరు కారం సినిమాలోని కుర్చీ మడతపెట్టి సాంగ్ యూట్యూబ్‌లో 800 మిలియన్ల వ్యూస్ దక్కించుకుంది. తెలుగు సినిమా వీడియో హయ్యెస్ట్ వ్యూస్ దక్కించుకున్న సెకండ్ పాటగా నిలిచింది. మహేష్‌బాబు తో పాటు శ్రీలీల కెరీర్‌లో హయ్యెస్ట్ వ్యూస్ దక్కించుకున్న సాంగ్ కూడా ఇదే కావడం గమనార్హం. మాస్ పాటు మహేష్‌బాబు, శ్రీలీల స్టెప్పులు, తమన్ బీట్స్ మ్యూజిక్ ఆకట్టుకున్నాయి. అల్లు అర్జున్ అల వైకుంఠపురంలో సినిమాలోని సామజవరగమనా ఫస్ట్ ప్లేస్‌లో ఉంది. ఈ సాంగ్‌కు ఇప్పటివరకు 944 మిలియన్ల వ్యూస్ వచ్చాయి.



# జై భీమ్ కాంబోలో మరో మూవీ



జై భీమ్ తర్వాత సూర్య, డైరెక్టర్ టీజే జ్ఞానవేల్ కాంబోలో మరో సినిమా రాబోతుంది. కేజీఎఫ్, సలార్ సినిమాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించబోతుంది. సోమవారం ఈ పాన్ ఇండియన్ మూవీని అఫీషియల్‌గా ప్రకటించారు. నిజాయితీ కలిగిన ఓ అర్థవంతమైన కథను వెండితెరపై ఆవిష్కరించబోతుండటం గర్వంగా ఉందంటూ హోంబలే ఫిల్మ్స్ ప్రకటించింది. తమిళంలో నిర్మిస్తోన్న ఈ సినిమాను తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో రిలీజ్ చేయబోతున్నారట. చెన్నైలో రెండు రూపాయల డాక్టర్‌గా ఫేమస్ అయిన తిరువెంగడం వీరరాఘవన్ జీవితం ఆధారంగా ఈ మూవీ తెరకెక్కుతోన్నట్లు సమాచారం. కాగా సూర్య హీరోగా నటిస్తోన్న 48వ మూవీ ఇది. సాయి అభ్యంకర్ మ్యూజిక్ అందిస్తున్నాడు.

# తేజా సజ్జాకు జోడీగా బాలీవుడ్ బ్యూటీ

టాలీవుడ్‌లోకి మరో బాలీవుడ్ బ్యూటీ ఎంట్రీ ఇవ్వబోతుంది. ప్రశాంత్‌వర్మ డైరెక్షన్‌లో వచ్చిన జాంబీరెడ్డికి సీక్వెల్ జాంబీ రెడ్డి 2 తెరకెక్కుతోంది. ఈ మూవీలో తేజా సజ్జాకు జోడీగా జాన్వీ కపూర్ చెల్లెలు షనయా కపూర్ హీరోయిన్‌గా నటించబోతుంది. హారర్ కామెడీగా వస్తున్న ఈ మూవీతోనే టాలీవుడ్‌లోకి తొలి అడుగు వేయబోతుంది. బోనీకపూర్ తమ్ముడు, బాలీవుడ్ నిర్మాత సంజయ్ కపూర్ కూతురు అయిన షనయా గతేడాది రిలీజైన బాలీవుడ్ మూవీ ఆంఖో కీ గుస్తాకియాన్‌తో హీరోయిన్‌గా ఫస్ట్ టైమ్ కెమెరా ముందుకొచ్చింది. ఈ సినిమా కంటే ముందు జాన్వీకపూర్ గుంజన్ సక్సేనా సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసింది. ఈ మూవీలో ఎస్‌జే సూర్య, గెటప్ శీను కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు.



# ఓటీటీలోకి హాలీవుడ్ హారర్ మూవీ

హాలీవుడ్ సినీ చరిత్రలోనే అత్యధిక లాభాలను ఆర్జించిన సినిమాగా రికార్డ్ క్రియేట్ చేసింది సైకలాజికల్ హారర్ మూవీ అబ్సెషన్. చాలాకాలంగా ఓటీటీ రిలీజ్ కోసం ఎదురుచూస్తున్న మేకర్స్ శుభవార్త వినిపించారు. జూన్ 30 నుంచి యాపిల్ టీవీ ఓటీటీలో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు ప్రకటించారు. అమెజాన్ ప్రైమ్‌లోనూ రిలీజ్ కానున్నట్లు సమాచారం. ఇంగ్లీష్, తెలుగు, తమిళం, హిందీ భాషల్లో అందుబాటులోకి రానున్న ఈ మూవీ ఏడు కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కి వరల్డ్ వైడ్‌గా రూ. 3100 కోట్లకుపైగా కలెక్షన్స్ రాబట్టింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.